TELTEL/2015/66279

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :159 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 29-08-2025 | పేజీలు:4 వెల: 2.00

## భారత్‌తో వైరం.. డొనాల్డ్ ట్రంప్ పై హౌస్ డెమోక్రాట్స్ ఫైర్

న్యూఢిల్లీ,భారత్ పై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారీఫ్స్ విధించడాన్ని యూఎస్ ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. తాజాగా, హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ డెమోక్రాట్స్ ట్రంప్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు.రష్యా నుంచి ఆయిల్ భారీగా కొంటున్న చైనా తదితర దేశాలపై సుంకాలు వేయకుండా ఇండియానే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని క్వశ్చన్ చేశారు.యూఎస్ భారత్ సంబంధాలను దెబ్బ తీస్తున్నారు.. దీని వల్ల అమెరికన్స్ కు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇది ఉక్రెయిన్ కోసం చేస్తున్నట్లు అనిపించడం లేదు అని హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ డెమోక్రాట్స్ మండిపడ్డారు.ఇక, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికన్ వినియోగదారులు, వ్యాపారాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హౌస్ డెమోక్రాట్స్ పేర్కొన్నారు. దీని ఫలితంగా వస్తువుల ధరలు పెరగడంతో పాటు ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా, భారత్‌పై విధించిన టారీఫ్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇండియాను టార్గెట్ చేయడం మానుకోవాలని సూచించారు.

## ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే వాయిదా.. ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న హరీశ్ రావు



హైదరాబాద్: కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి తమకు సాటిలేదని బీఆర్ఎస్ పార్టీ మరోసారి నిరూపించుకున్నది. మెదక్ జిల్లాలో భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు , దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పర్యటిస్తున్నారు. ముంపు గ్రామాల్లో తిరుగుతూ తామున్నామంటూ బాధితులకు భరోసానిస్తున్నారు. ప్రజలను పరామర్శిస్తున్నారు. మరోవైపు వాతావరణాన్ని సాకుగా చూపి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కామారెడ్డి పర్యటనను వాయిదా వేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలో ఏరియల్ సర్వే చేయాల్సి ఉన్నది. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో తన పర్యటనను సీఎం వాయిదా వేసుకున్నారు. దీంతో తన నివాసంలో మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.మరోవైపు మెదక్ జిల్లాలో ముంపు గ్రామాలలో స్థానిక నాయకులు, ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డితో కలిసి హరీశ్ రావు పర్యటిస్తున్నారు. బూరుగుపల్లి గ్రామంలో తెగిపోయిన రోడ్డు పరిశీలించిన ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడారు. అక్కడి నుంచి స్థానిక నాయకుల వాహనాలలో రాజాపేటకు బయలుదేరి వెళ్లారు. బుధవారం నుంచి జలదిగ్బంధంలో రాజాపేట, ధూప్ సింగ్ తండా వాసులను పరామర్శించనున్నారు.

భారీ వర్షాలపై కేసీఆర్ ఆందోళన..

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తం కావడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ నుంచి ఖమ్మం దాకా పలు జిల్లాల్లో వరదలతో నివాసాలు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలకు అధినేత ఫోన్లు చేసి ఈ మేరకు అప్రమత్తం చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ వంతుగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ దిశగా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అధినేత కేసీఆర్ సూచించారు.

## పుతిన్ కాదు.. ఇది 'మోదీ యుద్ధం'.. భారత్‌పై అమెరికా అక్కసు



వాషింగ్టన్: భారత్‌ను టార్గెట్ చేసిన అమెరికా మరోసారి మన దేశంపై తన అక్కసును వెళ్లగక్కింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కొనసాగడానికి భారత్ ప్రధాన కారణం అంటూ వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నవారో సంచలన ఆరోపణలు గుప్పించారు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధాన్ని 'మోదీ యుద్ధం' అంటూ కామెంట్స్ చేశారు. ఇదే సమయంలో అమెరికా సుంకాల నుంచి భారత్ తప్పించుకోవాలంటే రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం వెంటనే ఆపేయాలని సూచనలు చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నవారో తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'రష్యా–ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు భారత్ ప్రధాన కారణం. రష్యా నుంచి రాయితీపై భారత్ ముడిచమురు కొనుగోలు చేయడంతో యుద్ధంలో పుతిన్ దూకుడుగా వ్యవహరించారు. భారత్ అలా కొనుగోలు చేయకపోతే యుద్ధం ఇంత కాలం కొనసాగేది కాదు. ఇది మోదీ యుద్ధం. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ ఆపేయాలి. రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి చర్యలకు భారత్ కూడా సహకరించాలి. మోదీ తీరు విచిత్రంగా ఉంది. రష్యా విషయంలో మోదీ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇరుదేశాల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే.. భారత్ కూడా అందుకు సహకరించాల్సి ఉంటుంది. భారత్ చర్యల వల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు నష్టపోవాల్సి వస్తుంది. ఒకవేళ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును నిలిపివేస్తే.. 25 శాతం సుంకాలను పునరుద్ధరిస్తారా? అని ప్రశ్నించగా.. భారత్ ఆ దిశగా చర్యలు తీసుకున్న తర్వాతి రోజు నుంచే 25శాతం సుంకాలు అమలుచేస్తామని స్పష్టంచేశారు.అంతకుముందు కూడా నవారో భారత్‌పై సంచలన కామెంట్స్ చేశారు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకొంటూ భారత్ 'లాభదాయకమైన పథకం' నడుపుతోందని ఆరోపించారు. భారత్‌ను సుంకాల 'మహారాజు'గా అభివర్ణించారు. భారత్‌తో అమెరికా వ్యాపారం వల్ల అమెరికన్లపై పడే నికర ప్రభావం ఏంటి?. అమెరికా వ్యాపారాన్ని, అమెరికన్ కార్మికులను ఇది దెబ్బతీస్తుంది. అమెరికా నుంచి పొందుతున్న డబ్బును రష్యన్ చమురు కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. ఆ డబ్బును రష్యా ఆయుధాల తయారీకి వాడి ఉక్రేనియన్లను చంపుతోంది. జరుగుతున్న రక్తపాతంలో తన పాత్రను గుర్తించడానికి భారత్ ఇష్టపడటం లేదు. ప్రస్తుతం భారత్ చేస్తున్నది శాంతిని కోరుకునేలా లేదని, యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లుగా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు.

## బిహార్‌లో ముగ్గురు జైష్ ఎ మొహమ్మద్ ఉగ్రవాదులు..




పాట్నా:బీహార్‌లో టెర్రరిస్ట్ యాక్టివిటీస్ పెరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు నేపాల్ మీదుగా బిహార్‌లోకి ప్రవేశించినట్లు నిఘా వర్గాలు సమాచారం అందించాయి.సరిహద్దు రాష్ట్రమైన బీహార్‌లో టెర్రరిస్ట్ యాక్టివిటీస్ పెరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు నేపాల్ మీదుగా భారతదేశంలోకి ప్రవేశించినట్లు నిఘా వర్గాలు సమాచారం అందించాయి. దీంతో బీహార్ రాష్ట్రంలో భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచారు.నిఘా వర్గాల సమాచారంతో రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు బార్డర్ జిల్లాలైన కిషన్‌గంజ్, అరారియా, పశ్చిమ చంపారన్‌లలో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ ప్రాంతాలు నేపాల్ సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో ఉగ్రవాదులు ఈ రూట్ ఎంచుకున్నారని అధికారులు భావిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలు, రద్దీగా ఉండే మార్కెట్లు, బస్టాండ్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా సరిహద్దు దాటి వచ్చే వ్యక్తులపై నిఘా పెంచారు.

అనుమానితుల ఫోటోలు విడుదల

జైష్ ఉగ్రవాదుల కదలికల గురించి సమాచారం అందుకున్న భద్రతా బలగాలు, అనుమానితుల ఫోటోలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించాయి. స్థానిక ప్రజలకు కూడా ఈ సమాచారం తెలిసేలా అవగాహన కల్పిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఉగ్రవాదుల చొరబాటు వెనుక పెద్ద కుట్రే ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

## హిమాచల్‌పై ప్రకృతి ప్రకోపం.. 310 మంది మృతి



హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్ :(హిమాచల్ ప్రదేశ్)ను భారీ వర్షాలు (భారీ వర్షాలు) అతలాకుతలం అవుతున్నాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు (ఋతుపవనాలు) ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 300 మందిపైగా ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కలిపి రూ. 2,62,336.38 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (%న్రూణహీూ%) తెలిపిన వివరాల ప్రకారం.. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి అంటే జూన్ 20 నుంచి ఆగస్టు 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 310కి చేరింది. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 158 మంది మరణించారు.. రోడ్డు ప్రమాదాల్లో 152 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 369 మంది గాయపడ్డారు. 38 మంది గల్లంతయ్యారు.ఈ వర్షాలకు మండి జిల్లా అత్యధికంగా ప్రభావితమైంది. అక్కడ 51 మంది మరణించారు. అందులో 29 మరణాలు వర్షాలకు సంబంధించినవి కాగా, 22 రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించినవి. ఇక కాంగ్రాలో 49, చంబాలో 36, సిమ్లాలో 28 మరణాలు నమోదయ్యాయి.

## జలమయమైన కామారెడ్డి,మెదక్ జిల్లాలు..



హైదరాబాద్,తెలంగాణలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైపోయింది. ఇప్పటికే చాలామంది ముంపు గ్రామాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన వర్షానికి రోడ్లు, పంట పొలాలు, ఇల్లు అన్ని మునిగిపోవడమే కాకుండా చాలా భయంకరంగా మారిపోయాయి. తెలంగాణలోని మెదక్, కామారెడ్డి జిల్లాలో 24 గంటల నుండి అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. ఈ వర్షపు నీటి కారణంగా ముంపు ప్రాంతాల్లో ఉన్న ఇల్లు, పొలాలు అన్ని మునిగిపోయాయి. వాగులు, వంకలు అన్ని నీళ్లతో పొంగి పొర్లుతున్నాయి. 24 గంటల నుండి పడుతున్న వర్షంతో ఆ రెండు జిల్లాల్లో ప్రస్తుతం చోటు చేసుకున్న పరిస్థితికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ వీడియోలు చూస్తే మాత్రం చాలా భయానకంగా ఉన్నాయి అని చెప్పవచ్చు.ఆ రెండు జిల్లాలలో వర్షం ఎంతలా నమోదయ్యిందంటే.. ఒక అంతస్తు ఉన్న ఇల్లు పూర్తిగా మునిగిపోయే వరకు నీళ్లు చేరుకున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ అధికారులు చాలామంది ప్రజలను కాపాడి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అలాగే వరదల్లో చిక్కుకున్న వారిని పోలీసులు, సహాయ బృందాలు రక్షిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో పడ్డ వర్షానికి జిల్లా మొత్తం అస్తవ్యస్తమయ్యింది. ముఖ్యంగా ఎటు చూసినా నీరే నిండి ఉండడంతో జనజీవనం స్తంభించిపోయింది. నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. కామారెడ్డి లో ఉండే గొస్కె రాజయ్య కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలలో వరద ఉధృతికి రోడ్లు కూడా పూర్తిగా కొట్టుకుపోయాయి. కామారెడ్డి నుండి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు పూర్తిగా ధ్వంసమైన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. ఈ భయానక దృశ్యాలను చూసి చాలామంది ప్రజలు ఆందోళన చెందుతున్నారు..చాలా చోట్ల రహదారులు కోతకు గురవ్వడంతో పాటు అక్కడక్కడ రోడ్లు మధ్యలో తెగిపోయి రవాణా కూడా నిలిచిపోయింది. కామారెడ్డి జిల్లాలో ఉండే పోచారం ప్రాజెక్టుకు కూడా భారీ వరద నీరు వచ్చి చేరింది. అలా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలు కామారెడ్డి, మెదక్ జిల్లాలో ఉన్న తాజా పరిస్థితులను తెలియజేస్తున్నాయి.ఈ దృశ్యాలు చాలా భయానకంగా ఉన్నాయి అని ఈ వీడియో చూసిన నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు భారీగా పడటంతో స్కూళ్లకు, ఆఫీసులకు కూడా సెలవులు ఇచ్చేశారు. ఈరోజు ఉండే పరీక్షలు అన్నీ కూడా వాయిదా వేసేసారు. అలాగే ప్రజలెవరు బయటికి రాకూడదని అత్యవసరం అయితేనే బయటికి రావాలని చెబుతున్నారు.అల్పపీడన ప్రభావంతో మరో రెండు, మూడు రోజుల వరకు భారీ వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ వర్షం వల్ల ప్రభావితమైన ప్రాంతాలు కోలుకోవాలంటే చాలా రోజులే పడుతుంది. ఈ భారీ వర్షాల వల్ల ప్రజలు చాలా నష్టపోయారు.మరి ఈ వర్షాల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం తరఫున ఏదైనా సహాయం అందుతుందా అనేది చూడాలి.

## అమెరికా టారీఫ్‌లకు భయపడొద్దు..



న్యూఢిల్లీ,భారత్‌పై అదనపు సుంకాలను అమెరికా అమలు చేయడంపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్రంగా మండిపడ్డారు. ట్రంప్ విధించే పన్నులకు భారతీయులు భయపడొద్దని సూచించారు.ఈ సందర్భంగా స్వదేశీ ఉత్పత్తుల వినియోగానికి పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే మన టార్గెట్.. మన జీవితంలో అవసరమైన అన్ని వస్తువులను మన దగ్గర తయారైనవే కొనాలి అని సూచించారు. వాటిలో మన ఐక్యతను, నిజమైన భారతీయుడిగా నిరూపించుకోవాలని చౌహాన్ పేర్కొన్నారు.ఇక, 144 కోట్ల జనాభా భారతదేశం యొక్క బలం.. ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ధీమా వ్యక్తం చేశారు. మన దేశంలో ఆహార నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.. మన ప్రజలకు మాత్రమే కాదు, అవసరమైతే ప్రపంచానికీ కూడా అన్నం పెట్టే సామర్థ్యం మనకు ఉందని చెప్పుకొచ్చారు. శాస్త్రవేత్తలు, రైతులు, వ్యాపారులు, యువ శక్తితో భారత్‌ను ఎలాంటి పరిస్థితుల్లోనైనా ముందుకు తీసుకెళ్తాం అని స్పష్టం చేశారు. మరోవైపు, రష్యా ముడి చమురు కొనుగోళ్ల సాకుతో భారత్ పై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటి వరకు సుమారు 50 శాతం సుంకాలు విధించారు. ఇండియాతో పాటు దాదాపు 70 దేశాలపై విధించిన టారీఫ్స్ అమల్లోకి వచ్చాయి.

## పేదోళ్ల ఓట్లే తొలగించారు.. మరిన్ని ఆధారాలు బయటపెడతా



పాట్నా:బీహార్‌లో బడుగు బలహీనవర్గాల ప్రజల ఓట్లే తొలగించారని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ అధికార్ యాత్ర పేరుతో రాహుల్ గాంధీ బీహార్‌లో పర్యటిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం.. అధికార పార్టీతో కుమ్మక్కై 65 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. ఇందులో పేదోళ్ల ఓట్లే ఉన్నాయని తెలిపారు. ఓట్ల చోరీపై రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని వెల్లడించారు. గతంలో మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటకలో కూడా ఓట్ల చోరీ జరిగిందని. ఇప్పుడు బీహార్‌లో కూడా అదే పంథా కొనసాగిస్తున్నారన్నారు. దీన్ని బీహార్ ప్రజలు సహించరని చెప్పారు. దొంగ ఓట్లతోనే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిందని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగిం చేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోం దని తీవ్ర ఆరోపణలు చేశారు.త్వరలోనే బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నా యి. ఇందుకోసం ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఈసీ ప్రత్యేక సర్వే చేపట్టి 65 లక్షల ఓట్లు తొలగించింది.ఈ వ్యవహారమే దుమారం రేపింది. అధికార పార్టీతో ఈసీ కుమ్మక్కై ఓట్ల తొలగిస్తుందంటూ పార్లమెంట్ వేదికగా విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఇప్పుడు తాజాగా బీహార్‌లో రాహుల్ గాంధీ యాత్ర చేపట్టారు.ఆగస్టు 17న మొదలైన యాత్ర.. సెప్టెంబర్ 1న ముగియనుంది.

## ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి



హైదరాబాద్: వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యక్ష పర్యటనలు నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లను పరిశీలించి, నీరు చేరిన ఇళ్లలోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని, నీటి ముంపు ఉన్న ఇళ్ల నుంచి నీరు బయటికి పంపే చర్యలు చేపట్టాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలో వరద పరిస్థితిపై జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్, కలెక్టర్, ఎస్పీతో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు జిల్లాలోని వర్షాల తీవ్రత, వరద ఉధృతి, నష్టపరిస్థితులపై మంత్రికి వివరాలు అందించారు. ఈ సందర్భంగా సీతక్క అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, ఎలాంటి అప్రమత్తత లోపం జరగకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు.వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్, వ్యవసాయ, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలు తక్షణం నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు మనోధైర్యం కల్పించాలని, గ్రామాల్లో శానిటేషన్ పనులను వేగవంతం చేసి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తలు పాటించాలని, వాతావరణం అనుకూలించగానే స్వయంగా జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

## సంపాదకీయం

**శుక్రవారం 29-08-2025**

# ట్రంప్ గొంతెమ్మ కోరికలు...

టారిఫ్‌లంటూ ఉరుముతున్న అమెరికా వాటిపై ఇండియాకు నోటీస్ కూడా ఇచ్చేసింది. భారత ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం వల్ల మన పరిశ్రమలు, ఎగుమతిదారులకు నష్టం తప్పదు. రైతులకూ అవి శరాఘాతాలు కాగలవు. మరోవైపు తమ వ్యవసాయ ఉత్పత్తులతో భారతీయ విపణిని ముంచెత్తాలనుకుంటున్న అమెరికా ఆలోచన మరీ ప్రమాదకరమైనది! భారతదేశం తమ దగ్గర నుంచి చమురు, ఆయుధాలు కొనాలంటూ అమెరికా ఒత్తిడి చేయడం అందరికీ తెలిసిందే. కానీ, తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబట్టడం పెద్దగా వెలుగులోకి రావడం లేదు. అమెరికా గ్రామీణ ఓటర్ల మెప్పు పొందడం కోసం ట్రంప్ మన రైతులను దెబ్బతీయడానికి సిద్ధమవుతున్నారు. అగ్రరాజ్య ఒత్తిడి కారణంగా భారత ప్రభుత్వం పత్తిపై కొంత సడలింపు వైఖరి చేపట్టింది. కొత్త పత్తి సీజనుకు ముందు విదేశీ పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని 40 రోజులపాటు తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇక్కడ విదేశీ పత్తి అంటే అమెరికన్ పత్తి దిగుమతులే. ట్రంప్ తెస్తున్న ఒత్తిడే భారత్‌ను ఈ నిర్ణయానికి పురిగొల్పిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఇండియాకు దిగుమతి అవుతున్న విదేశీ పత్తి ధర ఒక క్యాండీకి (355.6 కిలోలకు) రూ.50వేల నుంచి రూ.51వేలుగా ఉంది. భారత పత్తి సంస్థ (సీసీఐ) ఒక క్యాండీ పత్తిని రూ.56వేల నుంచి రూ.57వేల ధరకు విక్రయిస్తోంది. పత్తికి కొత్త కనీస మద్దతు ధరను రూ.61వేలుగా నిర్ణయించవచ్చు. ఈ పరిస్థితిలో తక్కువ ధరకు విదేశీ పత్తిని మన మార్కెట్‌లోకి అనుమతిస్తే మన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. పత్తిని ఎక్కువగా పండించే రాష్ట్రాల ఆదాయానికీ గండి పడుతుంది.

ఇతర దేశాల నెత్తిన చేయి...

విదేశీ పత్తి చవకగా లభ్యమవడం వల్ల కాస్తోకూస్తో లాభపడేది వస్త్ర తయారీ పరిశ్రమ మాత్రమే. ఈ పరిశ్రమకు ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. అసలు అమెరికన్ పత్తి చవకగా లభిస్తుండటానికి కారణం– ఆ దేశ ప్రభుత్వం తమ రైతులకు భారీ సబ్సిడీలు ఇవ్వడమే. అమెరికా సర్కారు పత్తితోపాటు మరెన్నో వ్యవసాయోత్పత్తులకు సబ్సిడీలిస్తోంది. అలాంటి ఉత్పత్తులైన పాలు, చీజ్, చక్కెర, సోయాబీన్, మొక్కజొన్న, బియ్యం, కనోలా వంటనూనె, ఇథనాల్‌లను కూడా భారత్‌పై రుద్దాలని ట్రంప్ చూస్తున్నారు. భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారమే తన పాడి పరిశ్రమనూ, మొక్కజొన్న తదితర వ్యవసాయోత్పత్తులను కాపాడుకుంటోంది. కానీ, అనేక అంతర్జాతీయ ఒప్పందాలనూ సంస్థలనూ పక్కకు నెట్టేస్తున్న ట్రంప్ సర్కారు డబ్ల్యూటీవోను కూడా స్వేచ్ఛా వాణిజ్యానికీ, మార్కెట్ అందుబాటుకూ అడ్డంకిగా పరిగణిస్తోంది. ఇతర దేశాలకు తన వ్యవసాయ సరకులను స్వేచ్ఛగా ఎగుమతి చేయాలనుకొంటున్న ట్రంప్– అమెరికాకు పొగాకు ఎగుమతులపై మాత్రం 350శాతం సుంకాలు విధిస్తున్నారు. విదేశీ దిగుమతులను ఖరీదైనవిగా మార్చడానికి సుంకాలను పెంచుతున్నారు. తమ వ్యవసాయదారులకు భారీగా సబ్సిడీలు ఇవ్వడం, ప్రత్యేక పథకాలను అమలు చేయడం ద్వారా విదేశాలకు అమెరికన్ వ్యవసాయ ఎగుమతులను చవకగా మారుస్తున్నారు. తమ వ్యవసాయ మిగులును విదేశాలకు అమ్ముకుంటున్నారు.

షరతులు పెట్టాల్సిందే...

ట్రంప్ సుంకాల బాదుడును తప్పించుకోవడం కొంచెం కష్టమైన పనే. అలాగని అమెరికా వ్యవసాయ సరకులను ఇక్కడ చవకగా గుమ్మరించడం వల్ల మన రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. అయితే కొంచెం తెలివిగా వ్యవహరిస్తే మార్గం దొరుకుతుంది. అమెరికా నుంచి వ్యవసాయ సరకులను దిగుమతి చేసుకోవడం తప్పనిసరయితే సేంద్రియ పంటలను, జీవావరణానికి హాని చేయని, సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో సాధించిన పంట ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకుంటామనే షరతు విధించాలి. మొదట అమెరికా నుంచి జన్యుమార్పిడి పంటల దిగుమతిని నిషేధించాలి. సేంద్రియ పద్ధతిలో పెంచిన పత్తిని మాత్రమే అనుమతించాలి. ఇతర పంటలకూ ఇదే నియమాన్ని వర్తింపజేయాలి. మన దగ్గర మొక్కజొన్న రైతులు ఏటా నష్టాల బారిన పడుతున్నారు. ఇలాంటప్పుడు అమెరికన్ జన్యుమార్పిడి(జీఎంవో) మొక్కజొన్న భారీగా భారతీయ మార్కెట్‌ను ముంచెత్తితే మన రైతుల రాబడి తగ్గిపోతుంది. దీన్ని నివారించేందుకు అమెరికా నుంచి సేంద్రియ మొక్కజొన్న దిగుమతులను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేయాలి. జీఎంవో మొక్కజొన్నతోపాటు జీఎంవో చక్కెరకూ తలుపులు మూసెయ్యాలి. అమెరికా వ్యవసాయ సరకులను బడా కార్పొరేషన్ల నుంచి కాకుండా సాధారణ రైతుల నుంచి, చిన్న రైతుల సహకార సంస్థల నుంచి కొనుగోలు చేయడం ద్వారా అగ్రరాజ్య రైతాంగం మద్దతు చూరగొనవచ్చు. విషతుల్య క్రిమినాశనులను వాడిన పంటల దిగుమతిని అనుమతించకూడదు. బాదంపప్పు, యాపిల్స్ తదితర పంటల్లోనూ విష రసాయనాల అవశేషాలను తనిఖీ చేయాలి. భారత్ ప్రస్తుతం వంట నూనెల కొరతను ఎదుర్కొంటోంది. అమెరికా దగ్గర భారీగా కనోలా, సోయా నూనె నిల్వలు ఉన్నాయి. అయితే జన్యుమార్పిడి చేయని వంట నూనెలను మాత్రమే దిగుమతి చేసుకోవాలి. సోయా పశుదాణాను కూడా తనిఖీ చేయాలి.స్వదేశీ వ్యవసాయ కార్పొరేట్ సంస్థల ప్రోద్బలంతో ట్రంప్ తమ పాలను, పాల పొడిని కొనాలంటూ మన దేశంపై ఒత్తిడి పెంచుతున్నారు. అయితే అమెరికాలో పశువులకు జీఎంవో మొక్కజొన్న, సోయాలతోపాటు మాంసం ఉపఉత్పత్తులనూ దాణాగా వేస్తుంటారు. అలాంటి పాలను భారతీయులు స్వీకరించలేరు. పైగా అమెరికా కార్పొరేట్ పాల దిగుమతులు అమూల్ సంస్థనే కాదు, చిన్న చిన్న పాడి సహకార సంఘాలనూ దెబ్బతీస్తాయి. దీన్ని నివారించడానికి, కేవలం సేంద్రియ పాలను మాత్రమే దిగుమతి చేసుకుంటామనే షరతు పెట్టాలి. ఏదేమైనా, సహజ పద్ధతుల్లో పండించిన పంటలు, ఉత్పత్తి చేసిన పాలను మాత్రమే కొనుగోలు చేస్తామని నిష్కర్షగా చెప్పడం ద్వారా అమెరికాకు కొంతమేరయినా అడ్డుకట్ట వేయవచ్చు. మన రైతులను, దేశ ప్రజల ఆరోగ్యాన్నీ సంరక్షించుకోవచ్చు.

# బీహారు ఓటరుపై...ఓటు చోర్ యాత్ర ప్రభావం?



పాట్నా:త్వరలో జరగానున్నబీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఓటర్ అధికార్ యాత్ర' చివరాఖరి ఘట్టానికి చేరుకుంది. ఈ నెల 17 న ససారంలో ప్రారంభమైన రాహుల్ యాత్ర, సెప్టెంబర్ 1న పాట్నాలో ముగుస్తుంది. అయితే, రాహుల్ గాంధీ సాగిస్తున్న ఈ యాత్ర రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా ? అంటే, రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. అయితే, రాహుల్ యాత్ర ప్రభావం, ఆయన ఆశించిన స్థాయిలో, ఆశించిన విధంగా అయితే, ఉండకపోవచ్చని, విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. నిజానికి, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్' ప్రభుత్వం పట్ల ప్రజల్లో కావల్సినంత వ్యతిరేకత వుంది. ముఖ్యంగా అటునుంచి ఇటు ఇటునుంచి అటూ గోడలు దూకుతూ,14 ఏళ్లకు పైగా ముఖ్యమంత్రి కుర్చీని అంటి పెట్టుకుని కూర్చున్న నితీష్ కుమార్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత మాత్రమే కాదు, ఒక విధమైన ఏహ్య భావం కూడా ఏర్పడిందని, అంటున్నారు. దానికి తోడు, నిరుద్యోగం, క్షీణిస్తున్న శాంతి భద్రతల సమస్యలు తదితర సమస్యల కారణంగా, ప్రభుత్వ వ్యతిరేక పవనాలు చాలా బలంగా వీస్తున్నాయి. అవును ఇటు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పట్ల, అటు, ఎన్డీఎ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పరిశీలకులు పేర్కొంటున్నారు. అలాగే, ఇటీవల వివిధ సంస్థలు నిర్వహించిన ప్రీ పోల్ సర్వే ఫలితాలను గమనిస్తే రాష్ట్రంలో, కేవలం 18 శాతం మంది ఓటర్లు మాత్రవే, ఎన్డీఎ ప్రభుత్వం కొనసాగాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో 48 మంది ఓటర్లలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. అన్నిటికీ మించి, ముఖ్యమంత్రిగా ఎవరు బెస్ట్ అన్న ప్రశ్నకు, 25 శాతం మంది నితీష్ కుమార్' కు జై కొడితే, 32 శాతం మంది ఆర్జేడీ, నాయకుడు,మహా ఘటబంధన్' ముఖ్యమంత్రి అభ్యర్ధి తేజస్వీ యాదవ్'కు జై కొట్టారు. ముఖ్యంగా యువత తేజస్వీ యాదవ్' వైపు మొగ్గు చూపుతున్నారు. నితీష్ కుమార్'కు తేజస్వీ యాదవ్' బలమైన ప్రత్యర్థిగా ఓటర్లు గుర్తించినట్లు సర్వేలు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపధ్యంలో అక్టోబర్, నవంబర్ నెలలో జరగనున్నబీహార్ అసెంబ్లీ ఎన్నికలలో, ఎగసి పడుతున్న నితీష్ ప్రభుత్వ వ్యతిరేకత, రాష్ట్రంలో వీస్తున్న తేజస్వీ అనుకూల పవనాలను ప్రధాన ఎన్నికల ప్రచార అస్త్రాలుగా చేసుకుంటే, మహా ఘట బంధన్' విజయావకాశాలు' మరింత మెరుగ్గా ఉండచ్చని పరిశీలకులు అంటున్నారు. అలాగే, రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర' వలన కూడా మహా ఘటబంధన్' కు కొంత ప్రయోజనం జరగవచ్చు కానీ, ఎన్నికల కథా కథనం స్థానిక సమస్యల నుంచి పక్కకు వెళ్ళే ప్రమాదం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి, కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఓటర్ అధికార్ యాత్ర'కు ఆశించిన స్థాయిలో స్పందన రాక పోగా, రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలలో నిజం లేదనే విషయం తేట తెల్లం కావడంతో, ఒక ప్రత్యేక వర్గానికి చెందిన ప్రజలు మినహా ఇతర వర్గాల ప్రజలు రాహుల్ యాత్రను అసలు పట్టించుకోవడం లేదని అంటున్నారు. అలాగే,అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు సహజంగా స్థానిక సమస్యలు,స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తారు కానీ, జాతీయ అంశాలకు మరీ ముఖ్యంగా, ఎన్నికల అక్రమాలకు సంబదించిన అంశాలకు ఓటర్లు అంతగా ప్రాధాన్యత ఇవ్వరని పరిశీలకులు బావిస్తునారు. నిజానికి, నితీష్ వర్సెస్ తేజస్వీగా సాగ వలసిన ఎన్నికల ప్రచారం, రాహుల్ ఎంట్రీతో మోదీ వర్సెస్ రాహుల్. పోల్ బ్యాటిల్' గా మారుతోందని, ఇది మహా ఘట బంధన్' కు అంతగా మంచిది కాదని అంటున్నారు.అంతే కాకుండా మహా ఘట బంధన్' కు అనుకూలంగా ఉన్న వాతావరణం తిరగబడే ప్రమాదం లేక పోలేదని విశ్లేషకులు అంటున్నారు.

# కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?

న్యూఢిల్లీ,నాగుపామును ఆడించే మంత్రగాడు అదే పాము కాటుకు గురయ్యాడని సామెత. మన రాజకీయ నేతలు చేసే కొన్ని విన్యాసాలు భవిష్యత్తులో వారికే తలనొప్పిగా మారతాయన్నది వారు విస్మరిస్తుంటారు. తాజాగా కేంద్రం తీసుకు వస్తున్న చట్టం కూడా అదే తరహాలో ఉందా అనిపిస్తోంది. వినడానికి మాత్రం ఇది బాగుందే అనిపించవచ్చు. కాని పరిశీలిస్తే ఇందులో ఏదో మతలబు ఉందన్న సంగతి అర్థమవుతుంది.ప్రధాని లేదా ముఖ్యమంత్రి, లేదా మంత్రులు ఎవరైనా ముప్పై రోజులు జైలులో ఉండవలసి వస్తే వారి పదవి ఆటోమాటిక్‌గా పోయే విధంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చట్టం తీసుకువస్తోంది. ఈ చట్టాన్ని సడన్‌గా ఎందుకు తీసుకు వస్తున్నారన్న దానిపై రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. బీజేపీయేతర పక్షాలు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తప్పించి ప్రభుత్వాలను అస్థిర పరచడానికి ఇది ఒక ఆయుధం అవుతుందన్న సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు. తమ మిత్రపక్షాలలో ఎవరైనా తోక ఝాడిస్తున్నారన్న అనుమానం వచ్చినా వారిపై కూడా ఈ అస్త్రం ప్రయోగించవచ్చన్న అభిప్రాయాన్ని విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి.ప్రత్యేకించి కేంద్రంలో పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను కట్టడి చేయడానికి కూడా దీన్ని వాడవచ్చని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ బిల్లుపై టీడీపీ, జేడీ(యూ)లు కూడా మథన పడుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ చట్టాన్ని కేంద్రం చిత్తశుద్ధితోనే చేస్తుంటే ఎవరికి అభ్యంతరం ఉండదు.కాని మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటీవలికాలంలో పెడదోరణులు ప్రబలిపోయాయి.తమ ప్రత్యర్ధులను ఎలాగైనా అణచివేయాలని, తద్వారా శాశ్వతంగా తామే అధికారంలో ఉండాలన్న తాపత్రాయం మన నాయకులలో అధికంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యయుతంగా ఎంతకాలం పాలనలో ఉన్నా ఫర్వాలేదు. అలా కాకుండా నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తుండడమే ఇబ్బందిగా మారుతోంది. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో న్యాయస్థానం ఒక తీర్పు ఇచ్చింది. ఎవరైనా ప్రజాప్రతినిధి రెండేళు జైలు శిక్షకు గురైతే వెంటనే అతను పదవికి అనర్హుడవుతాయన్నది దాని సారాంశం. దానివల్ల అనర్థాలు రావచ్చని తలంచిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆ తీర్పును రివర్స్ చేస్తూ ఒక ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది.కానీ అప్పట్లో రాహుల్ గాంధీ అవగాహనా రాహిత్యంతో ఆ ఆర్డినెన్స్ కాపీని బహిరంగంగానే చించివేశారు. ఒక రకంగా ఇది తన ప్రభుత్వాన్ని తానే అవమానించుకున్నట్లు కాదా! పైగా ఆనాటి ప్రదాని మన్మోహన్ సింగ్ పై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. అలాంటి వ్యక్తి నేతృత్వంలో వచ్చిన ఆ ఆర్డినెన్స్ పూర్వాపరాలు ఆలోచించకుండా అనుచితంగా ప్రవర్తించడంతో ఆ తీర్పు అమలులోనే ఉంది. దాని ఫలితంగా కొందరు తమ పదవులు కోల్పోయారు. ఉదాహరణకు లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష పడడంతో రాజ్యసభ సభ పదవి పోయింది. ఆ తర్వాత కాలంలో రాహుల్ గాంధీనే ఒక కేసులో రెండేళ్లకు పైగా శిక్షకు గురి కావడం, ఆ తర్వాత ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం జరిగిపోయింది. తదుపరి ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి పునరుద్దరించుకోగలిగారు. అది వేరే సంగతి.రాహుల్ ఈ ఉదంతంలో తాను చేసిన తప్పుకు తానే బలైనట్లే కదా! ఇప్పుడు బీజేపీ కూడా అదే తరహా ప్రయోగం చేస్తోందా? ఒకవేళ వేరే ప్రభుత్వం కేంద్రంలో వస్తే ,అప్పుడు ఇదే చట్టం బీజేపీ ప్రభుత్వాల మెడకు కూడా చుట్టుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఎవరు అధికారంలో ఉంటే వారు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నది వాస్తవం. ప్రధాని నరేంద్ర మోడీ ఒక సభలో మాట్లాడుతూ నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా? అని ప్రశ్నించారు. కొంతకాలం క్రితం ఢిల్లీలో లిక్కర్ స్కామ్ అంంటూ హడావుడి చేసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, కొందరు మంత్రులను అరెస్టు చేశారు. డిల్లీలో పోలీస్ వ్యవస్థ కేంద్రం చేతిలోనే ఉంటుందన్న సంగతి తెలిసిందే.కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయకుండా జైలులో ఉంటూనే ప్రభుత్వ విషయాలపై ఆదేశాలు ఇస్తుండేవారు. అలాగే తమిళనాడుకు చెందిన ఒక మంత్రిని ఈడి అరెస్టు చేసింది. ఆయన కూడా పదవికి రాజీనామా చేయకుండా కేబినెట్‌లో కొనసాగారు. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీకి అనుకూలంగా లేనివి. ఢిల్లీలో ఎన్నికలకు ముందు ఎలాగైనా ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించాలన్న లక్ష్యంతో బీజేపీ నాయకత్వం లిక్కర్ స్కామ్ పేరుతో కేజ్రీవాల్ ను జైలులో పెట్టిందని అప్పట్లో ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించేది. ఇలా కొద్దిమందిని దృష్టిలో ఉంచుకుని ఈ చట్టం తెస్తుండడం కరెక్టేనా అన్న చర్చ ఉంది.నిజంగానే మోడీకి అవినీతి వ్యవహారాలపై చిత్తశుద్ది ఉంటే ఏపీలో టీడీపీతో పొత్తు ఎలా పెట్టుకున్నారన్న ప్రశ్న వస్తుంది. ఎందుకంటే మోడీని అవినీతిపరుడని, టెర్రరిస్టు అని.. ఇంకా చాలాచాలా మాటలు టీడీపీ అధినేత, 2019 ఎన్నికలకు ముందు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు విమర్శించేవారు. మోడీ స్వయంగా ఏపీలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుపై పలు అవినీతి ఆరోపణలు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు



ఇస్తుంటే చంద్రబాబు దానిని తనకు ఏటీఎం గా మార్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికలలో చంద్రబాబు ఓటమి తర్వాత ఆయన పీఎస్ ఇంటిలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు జరపగా వివిధ కాంట్రాక్టు వ్యవహారాలలో రెండువేల కోట్ల అక్రమాలు జరిగాయని తేలినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అదే కాదు. స్కిల్ స్కామ్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అవినీతికి పాల్పడ్డారని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసింది.అప్పటికే కేంద్రానికి చెందిన ఈడీ అదే కేసులో పలువురిని అరెస్టు చేసింది. చంద్రబాబు వరకు కేసును ఈడీ తీసుకు రాలేదు.ఈలోగా టీడీపీతో మళ్లీ బీజేపీ జత కట్టింది. మరి ఇప్పుడు ఆ ఆరోపణలు సంగతేమిటి? అసలు ఆ కేసులలో నిజానిజాలు ఏమిటి? అన్యాయంగా చంద్రబాబు మీద ఆ ఆరోపణలు చేశారా?లేక వాస్తవం ఉందా? అన్నది ప్రజలకు తెలియనవసరం లేదా? తన ప్రభుత్వ ఓటమి తర్వాత చంద్రబాబు ఈ పరిణామాలను ఊహించే తెలివిగా బీజేపీ పెద్దలతో రాజీ చేసుకున్నారన్నది చాలా మంది భావన. ఆ తర్వాత బతిమలాడి బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నది బహిరంగ రహస్యమే.ఇలాంటివాటి గురించి మోడీ జవాబు ఇచ్చే పరిస్థితి ఉందా? ఇప్పుడు కూడా బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికి, తమ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ)లను తమ అదుపులో ఉంచుకోవడానికి ఇలాంటి చట్టం తెస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.దానికి తగినట్లుగానే టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు కృష్ణదేవరాయలు ఈ బిల్లును సమర్థిస్తూనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, లోపాలను సరిదిద్దాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీలో చర్చ జరుగుతుందని అన్నారు. అంటే ఈ బిల్లుపై వారు లోపల భయపడుతున్నట్లు తెలుస్తూనే ఉంది. జేడీ(యూ) నేత త్యాగి కూడా అదే తరహాలో స్పందించారు. కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలలో నిజం ఉన్నా, లేకపోయినా, చంద్రబాబు విషయంలో బీజేపీ అనుసరించిన ద్వంద్వ విధానం సహజంగానే ఈ సందేహాలకు తావిస్తుంది.ఇండియా కూటమి లోనే అవినీతిపరులు ఉన్నట్లు తమ పక్షంలో ఎవరూ లేనట్లు మోడీ మాట్లాడినా జనం ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో అవినీతి ఆరోపణలు వచ్చినా ఎందరిపై కేసులు పెడుతున్నారు? దేశ ప్రధాని మీద కేసు పెట్టే పరిస్థితి ఉందా? అలాగే ముఖ్యమంత్రి మీద కూడా రాష్ట్ర స్థాయిలో కేసులు పెట్టడం తేలిక కాదు. కాకపోతే న్యాయ వ్యవస్థను అడ్డు పెట్టుకుని కేంద్రం లోని అధికార పార్టీ తమ వ్యతిరేక పార్టీల సీఎం లను ఇబ్బంది పెట్టే అవకాశం ఉండవచ్చు.మరో ఉదాహరణ చూద్దాం. దశాబ్దాల కిందట కేంద్రం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది. అయినా దాని అమలు ఎలా ఉందో చూస్తూనే ఉన్నాం. ఇదే మోడీ ప్రభుత్వం ఇందులో ద్వంద ప్రమాణాలు పాటించడం లేదా? సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ జేడీ(యూ) పార్టీకి దూరం అయ్యారు. ఆ క్రమంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీ(యూ) కోరింది.దానిని ఆఘమేఘాల మీద ఆమోదించి అనర్హత వేటు వేసేశారు. తమ ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆయనను అనర్హుడిని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ లోక్ సభ స్పీకర్ ను కోరింది. మొత్తం టర్మ్ పూర్తయ్యింది కాని, ఆ పిటిషన్‌ను తేల్చలేదు. ఇంకా పలు ఉదాహరణలు ఇలాంటివి ఉన్నాయి. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? 2014–19 మధ్యకాలంలో ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీ 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను లాక్కోవడమే కాకుండా, వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టింది. అయినా ఆనాటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఒక్కరిపై కూడా చర్య తీసుకోలేదు. ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పది మంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ అటు శాసన వ్యవస్థలోను, ఇటు న్యాయ వ్యవస్థలోను పోరాడుతోంది. ఇంతవరకు అదేమీ తేలలేదు. అలాగే అంతకుముందు టర్మ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పలువురు బీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. వారిపై అప్పటి స్పీకర్ చర్య తీసుకోలేదు.పైగా వారంతా బీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించారు.

# ప్రకృతి పరిరక్షణ మన సంస్కృతి

తిరుమల,బారతీయ ఆధ్యాత్మిక విధానం మొత్తం ప్రకృతి చుట్టూ అల్లుకుని ఉన్నవే. ప్రకృతి ఆరాధన అన్నది కేవలం భారతీయ సంస్కృతిలోనే చూస్తాం. మన పండగలు పబ్బాలు కూడా వీటిచుట్టే పరిభ్రమిస్తాయి. పంచభూతాలైన భూమి,నీరు,గాలి, అగ్ని,ఆకాశం చుట్టూ తిరుగుతూ వాటిని పూజించే దిశగా సాగుతాయి. మన జీవన విధానానికి అవసరమైన ప్రతి ఒక్కటీ ప్రకృతి ఒడి నుంచి లభించేదే. అందుకే ప్రకృతిని దైవంలా భావించి పూజిండం చేస్తాం. వాటిని కాపాడుకునే క్రమంలో పూజిస్తాం. మన ప్రతి పండగా వీటికి మూలంగా ఉంటోంది. వినాయక చవితితేనే తీసుకుంటే ప్రకృతిని పూజించేదిగా చూడాలి. పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ షోడశ సంస్కరణల ద్వారా మనకు రుజువర్తనను అలవడేలా చేసింది. మన భారతదేశానికి ఉన్న గొప్ప ఆధ్యాత్మిక సంపదే మనలను వసుదైక కుటుంబ దిశగా నడిపించింది. మన ఐతిహ్యంలో మాత్రమే ఈ విధానం కనిపిస్తుంది. ఇలా నిత్యజీవితంలో మనం ఆచరించే మంచి అంతా ఆధ్యాత్మికత కిందకే వస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు రామాయణ, మహాభారత, భాగవతాల్లోని ఘట్టాలను వినిపించడం ద్వారా.. పెద్దల నుంచి నేర్చుకున్న సంస్కారాన్ని మన పిల్లలకు నేర్పడం ద్వారా మనకున్న గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం. భవిష్యత్ తరాలు కూడా మన ఆధ్యాత్మిక సంపద విలువ తెలుసుకుని, ఆచరణలో పెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు సాగిస్తున్నాం. మనిషి తాను బతుకుతూ ఇతరులను బతికేలా చేస్తూ ముందుకు సాగాలన్న ఓ మంచి ఆచారాన్ని మన పెద్దలు మనకు నేర్పారు. భక్తి, పూజలు,పునస్కరాలు అన్నీ ఇందులో ఇమిడి ఉన్నవే. ఆధ్యాత్మికత అంటే అది కేవలం భక్తి అనో, మతానికి సంబంధించిన అంశమో కాదని గుర్తించాలి. ఎవరైనా దీనిని ఆచరించడం అంటే మంచిని స్వీకరించిడం అని గుర్తించాలి. మానవ జీవన విధానాన్ని ఒక ఉత్తమమైన మార్గంలో నడిపే మార్గమే మన ఆధ్యాత్మికత అని గుర్తించాలి. పెద్దలు ఏదో చెప్పారని చేసే పూజలు మనకు అర్థమయ్యాక తత్వం బోధపడుతుంది. ఆధ్యాత్మికత అంటే ముక్కు మూసుకుని జపం చేయడం కాదు. మనం మంచి అలవాట్లకు దగ్గర కావడం అన్నది గుర్తించాలి. మనసు నిండా కోరికలతో పూజలు, జపాలు, తపాలు, యజ్ఞాలు, యాగాలు చేయడం కూడా మంచిని కాపాడడం ఎంతమాత్రమూ కాదు. ద్దలను గౌరవించడం, తోటివారికి చేతనైనంత సాయం చేయడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడం, మనకన్నా బలహీనులను హింసించకుండా ఉండడం.. ఇదంతా ఓమంచి ఆచారంగా చూడాలి. ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు తామెంతగా అభివృద్ధి చెందినా భారతీ సాంస్కృతిక జీవనం వైపు మొగ్గుచూపుతున్నారు.భారతీయ జీవన విధానానికి, మన సంస్కృతికి చేతులెత్తి మొక్కుతున్నారు. మన ఆధ్యాత్మిక జీవనవిధానం గురించి తెలుసుకున్న ఎందరో పాశ్చాత్యులు భారతదేశానికి వచ్చి ఇక్కడి సంస్కృతీసంప్రదాయాల గురించి తెలుసుకుంటున్నారు. పరిశోధనలు చేస్తున్నారు. దీనికి కారణం మనకున్న గొప్ప ఆధ్యాత్మిక సంపద మరే మతానికి లేదా దేశానికి లేకపోవడమే అని గుర్తించాలి. వేదాలు, అష్టాదశ పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురణాలు.. ఇలా మన ఆధ్యాత్మిక సంపద ఎంతో ఘనమైనదని గుర్తించారు. సృష్టి అంతా నిండి ఉన్న చైతన్యం ఒక్కటేనని.. ఆ చైతన్యమే పరమాత్మ అని మన సంస్కృతి చెబుతుంది. అందుకే సృష్టిలో ప్రతిదీ మనకు పూజనీయమే. మనం పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకూ సౌకర్యవంతంగా, సుఖంగా జీవించ డానికి అవసరమైన వనరులను ఎన్నింటినో ఈ ప్రకృతి అందిస్తుంది. అందుకే మనం ప్రకృతిని తల్లిగా భావించి పూజిస్తాం. భూమిని దేవతగా గౌరవిస్తాం. ప్రాణాధారమైన నీటిని, గాలిని.. ఇలా పంచభూతాలనూ దైవాలుగా భావించి కొలుస్తాం.

# భక్తిశ్రద్ధలకు ప్రతీక వినాయక చవితి

యాదగిరిగుట్ట,ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్ధి రోజు మనం వినాయకచవితి పండుగని జరుపుకుంటాము. గణపతిని పూజించకుండా ఎలాంటి శుభ కార్యమూ తలపెట్టం. ఎందుకంటే,ఆయన కృపాకటాక్షాలతో సకల కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయని శాస్త్రవచనం. ఏ పండగ రోజు లేని భక్తి శ్రద్ధలు వినయక చవితి రోజు ప్రదర్శిస్తారు. వినాయకుడికి కోపం రావద్దన్న స్పృహ చిన్నతనం నుంచే మన పెద్దలు అలవాటు చేశారు. అందుకే వినాయకచతుర్థి రోజు అందరూ ప్రాఃతకాలానే లేచి అభ్యంగన స్నానమాచరించి పట్టుబట్టలు లేదా శుభ్రమైన వస్త్రాలు ధరించి వినాయక పూజకు సిద్దం అవుతారు. భాద్రపదమాసంలో వానలు పడుతూ, ఎక్కడికక్కడ చిత్తడిగా, బురదగా ఉంటుంది. గుంటల్లో నీళ్ళు నిలిచి సూక్ష్మక్రిములు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో వినాయకునికి ఔషధ గుణాలున్న పత్రితో పూజ చేయడంవల్ల ఇంట్లో వాతావరణం బాగుండి, సూక్ష్మ క్రిములను నశింపజేస్తుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల పేరుతో తొమ్మిది రోజులు పూజ చేయడం ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు యథావిధిగా వ్రతం చేసే ఆచారం ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ఉంది. కొన్నిచోట్ల రానురాను మరుగున పడుతోంది. కొందరు పూజ ముగిసిన తర్వాత వినాయకుని విగ్రహాన్ని తొలగించినప్పటికీ పత్రిని మాత్రం కనీసం తొమ్మిది రోజులు ఇంట్లోనే ఉంచి తర్వాత నదిలో నిమజ్జనం చేస్తారు. అంటే, పదిరోజులపాటు మనం ఔషధ గుణాలున్న పత్రి నుండి వచ్చే గాలిని పీలుస్తాం. తొమ్మిది రోజుల తర్వాత సమీపంలోని నదిలోనో, చెరువులోనో నిమజ్జనం చేయడం వల్ల కూడా లాభమే చేకూరుతుంది. పత్రిలోని ఔషధ గుణాలలో కొన్నయినా ఆ నీటిలో చేరతాయి. ఆ రకంగా అవి నీటిలోని క్రిములను నశింపజేస్తాయి. ఆ నీటిని తాగినప్పుడు అనారోగ్యాలు కలగవు. తొమ్మిదిరోజులు జరిపే పూజ వల్ల ఆరోగ్యపరంగా సత్ఫలితం కలుగుతుందని నమ్మటం మూఢనమ్మకం కాదు! శాస్త్రీయంగా ఇది నిజమే. వినాయక వ్రతం ఆచారం వెనుక ఉన్న ఆయుర్వేద పరమైన కారణం ఇది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. వక్రతుండుడు; ఏకదంతుడు; మహోదరుడు; లంబోదరుడు; గజాననుడు; . వికటుడు; విఘ్నరాజు; . ధూమ్ర పర్ణుడు. ఈ పూజా సామాగ్రినంతా సిద్ధం చేసుకొని, మండపాన్ని ఏర్పరచి మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఆవాహన చేసి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. స్వామికి ఇష్టమైన కుడుములు, అపూపములు, టెంకాయలు, పాలు, తేనె, అరటిపండ్లు, పాయసం, పానకం, వడపప్పు మొదలైన నైవేద్యాలు సమర్పించి, వ్రతకథను చదువుకొని, కథాక్షతలని శిరస్సున ధరించి, బ్రాహ్మణులను సత్కరించి, ఆనందంతో అందరు కలసి ప్రసాదాలని స్వీకరించి, గణేశ భజనలతో, కీర్తనలతో, పురాణశ్రవణంతో ఆయన మీదే మనసు లగ్నం చేసి, ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పండగను జరుపుకుంటాము. వినాయక చవితి సందర్భంగా ఈ పండుగ ప్రాధాన్యతను, వినాయకుని విశిష్టతను ఏటా ఆచరిస్తుంటాం.

# తిరుమలలో కూలిన భారీ చెట్టు

తిరుమల, తిరుమలలో పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం తిరుమల ఎంబీసీ సమీపంలో పెద్ద చెట్టు ఒక్కసారిగా నేలకూలింది.ఈ ప్రమాదంలో టీటీడీ ప్రైవేట్ భద్రతా సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గార్డును చికిత్స కోసం వెంటనే అశ్వినీ ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగినప్పుడు చెట్టుకు సమీపంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణనష్టం జరగలేదు. చెట్టు– పడిన సందర్భంలో భారీ శబ్దం రావడంతో భక్తులు, సిబ్బంది ఒక్కసారిగా గందరగోళానికి గురయ్యారు.సంఘటన సమాచారం అందుకున్న వెంటనే విజిలెన్స్ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని

# యువతలో స్వాతంత్ర్య చైతన్యం..

ముంబై,స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు వినాయక నవరాత్రులను బాలగంగాధర్ తిలక్ బాగా ఉపయోగించుకున్నారు. ప్రజలను భక్తిభావంతో ఏకం చేసి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించారు. ఇందులో భాగంగా ఇంటికే పరిమితమైన గణపతి పూజను వీధివీధినా పూజలు అందుకునేలా చేశారు. ఇలా గణపతి నవరాత్రులుగా మలిచిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్‌కు దక్కింది. ఆనాడు ఉద్యమం కోసం ఉత్సవాల నిర్వహణ అవసర మయ్యింది. ఛత్రపతి శివాజీ పరిపాలన సమయంలోనే మరాఠా రాజ్యంలో వినాయక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని కొందరు చరిత్రకారులు అంటారు. వినాయకుడిని పీష్వాలు తమ కులదేవుడిగా ఆరాధిస్తారు. కనుక 17వ శతాబ్దంలో శివాజీ చేతుల మీదుగా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయని కొందరి అభిప్రాయం. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా లోకమాన్య తిలక్ శివాజీ ఉత్సవాలు, గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని చారిత్రక అధ్యయనకారులు చెబుతారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధాన్ని ధిక్కరిం చేందుకు, దైవభక్తినీ,దేశభక్తిని జోడించిన అపురూప సందర్భం గణపతి నవరాత్రులు. వలస పాలనలో వివక్షకు గురవుతున్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పునరుద్ధరించేందుకు తొమ్మిది రోజుల వేడుక నిర్వహించాలన్న ఆలోచన చేయడం ఆనాడు అవసర మయ్యింది. జాతీయోద్యమంలో భాగంగా మహారాష్ట్ర పుణెలో 1893లో లోకమాన్య తిలక్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తి భాగ్యనగరానికీ వ్యాప్తి చెందింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు గణపతి ఉత్సవాలు ఘనంగా సాగుతూ వచ్చాయి. దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్షను సామా న్యుల్లో రగిలించేందుకు, గమ్యం తెలియని బానిసల అయోమయంలో ఉన్న యువతను ఒక సామాజిక లక్ష్యం దిశగా నడిపించేందుకు, 127 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సర్వ జనైక్య గణేశ్ ఉత్సవాలకు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రులను సామాజిక వేదికలుగా మలిచారు. ఆ జాతీయోద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వ్యాపించింది. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన తిలక్ పిలుపుతో కొందరు భాగ్యనగరవాసులు ముందుకొచ్చారు. నగరంలో స్థిరపడిన కొందరు మహారాష్ట్రీయులు సామూహిక వినాయక పూజకు నాంది పలికారు. అలా హైదరాబాద్‌లో గణపతి ఉత్సవాల శోభ ప్రారంభమయ్యింది. అప్పట్లో చెరువుల్లోని నల్లమట్టితో వినాయక ప్రతిమల తయారీకి వాడేవారు. చవితినాడు మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు తొలి, మలి సంధ్యా సమయాల్లో పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. సాయంత్రం వేళల్లో 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జానపద నృత్యాలు, గీతాలాపన, భక్తి కీర్తనలు, భజన, పారాయణం, పద్య, ఇతిహాస నాటకాలు, సంగీత కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చేవారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వచ్చేవారు. ఆ పూజా కార్యక్రమాలు, కళా ప్రదర్శనలే దేశ సమైక్యతకు స్ఫూర్తిగా నిలిచేవి. అలాంటి పరిస్థితులలోనూ నిజాం ప్రభుత్వం సమ్మతం చేలా గణపతి నవరాత్రులు నగరంలో జరగడం విశేషం. భారత గుణవర్ధిని సంస్థ ఆధ్వర్యంలో ఏటా వినాయక నవరాత్రుల సందర్భంగా పదిరోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇరవై శతాబ్దం ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. చార్మినార్ పరిసరాల్లోని దివాన్ దేవిడి ప్రాంతంలోని దీక్షిత్ వాడ, కోఠిలోని మహారాష్ట్ర గ్రంథ సంగ్రహా లయ్, సుల్తాన్ బజార్ మహారాష్ట్ర మండల్, కాచిగూడ, హరిబౌలి, నాంపల్లి తదితర ప్రాంతాల్లో గణపతి నవరాత్రి సామూహిక ఉత్సవాలు మొదలయ్యాయి. పండుగ పది రోజులూ ఆ ప్రాంత వీధులన్నీ కోలా హలంగా ఉండేవి. ఆ ప్రాంతాలలో మహారాష్ట్రీయులు ఎక్కువ మంది ఉండేవారు. తొమ్మిది రోజుల పాటు రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు కుటుంబంతో సహా వెళ్లేవాళ్లు. రెండు కళ్లు చాలవు అన్నంతగా సంబరాలు జరిగేవి. పదో రోజు తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు అంతా కలిసి మట్టి గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లి మూసీలో నిమజ్జనం చేసేవాళ్లు.

# రేసు గుర్రాల కోసం వేట!

హైదరాబాద్, తెలంగాణ పాలిటిక్స్ ఎవ్రీ వీక్ నెక్స్ట్ లెవల్ పీక్‌కు చేరుకుంటున్నా యి. ఒక పొలిటికల్ డెవలప్‌మెంట్ తర్వాత మరో పొలిటికల్ యాక్టివిటీతో ఇప్పటికే అధికార ప్రతిపక్షాల మధ్య వార్ ఆఫ్ వర్డ్స్ పేలుతున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో సుప్రీం డైరెక్షన్స్ ప్రకారం ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. దీంతో ఆ నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసేందుకు రెడీ అవుతున్నారన్న ప్రచారం బయలుదేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యే పదవులకు రిజైన్ చేసి బైఎలక్షన్స్ ఫేస్ చేయాలని డిసైడ్ అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నా యి. స్పీకర్ అనర్హత వేటు వేసే కంటే ముందే ఎమ్మెల్యే పదవులకు రిజైన్ చేయాలని భావిస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యాక రాజీనామా చేయాలన్న ఆలోచనలో ఈ నలుగురు ఉన్నారట.దానం నాగేందర్ కాంగ్రెస్ క్యాండిడేట్‌గా లోక్‌సభ ఎంపీగా పోటీ చేశారు కాబట్టి బైఎలక్షన్‌గా ఇరికిపోయారు. ఇక కడియం శ్రీహరి తన కూతురు కావ్యను కాంగ్రెస్ ఎంపీ క్యాండిడేట్‌గా బలపరుస్తూ బీఫామ్ మీద సంతకం చేశారని అంటున్నారు. తెల్లం వెంకట్రావు అయితే కాంగ్రెస్ కండువా కప్పుకుని ఎన్నికల్లో ప్రచారం చేశారు.ఇక ప్రభుత్వ సలహాదారుగా ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డిని కూడా అనర్హత భయం వెంటాడుతోందట. సీనియర్ బాన్సువాడ లోకల్ పాలిటిక్స్‌తో పాటు చేరేటప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన అసంతృప్తిగా ఉన్నారట. ఇలా ఈ నలుగురు స్పీకర్ వేటు వేసే కంటే ముందే పదవులకు రిజైన్ చేసి ఎన్నికలకు రెడీ అవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా టాక్ వినిపిస్తోంది.

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ సవాల్

మరోవైపు అపోజిషన్ బీఆర్ఎస్ ఉప ఎన్నికలకు సై అంటూ తొడలు కొడుతోంది. ఏకంగా పది నియోజకవర్గాల్లో ఎన్నికలకు సిద్ధమా అంటూ కాంగ్రెస్‌కు సవాల్ చేసి చర్చకు దారి తీశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అయితే పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై వేటు పడటం ఖాయమని ఫిక్స్ అయిపోయిందట బీఆర్ఎస్. ఆ ముగ్గురితో పాటు పది మందిపై వేటు వేయాలని డిమాండ్ చేస్తోంది కారు పార్టీ.జూబ్లీహిల్స్ బైపోల్ తర్వాత..ఆ మూడు నియోజకవర్గాలు లేకపోతే పది సీట్లకు ఉపఎన్నికలు రావొచ్చన్న అంచనాల్లో బీఆర్ఎస్ లీడర్లు ఉన్నారట. అయితే పది మంది జంపింగ్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై గులాబీ బాస్ కేసీఆర్ స్పెషల్ కాన్సంట్రేషన్ పెట్టినట్లు తెలుస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకత్వంపై కసరత్తు చేస్తున్నారట.ఉప ఎన్నికలు వస్తే గెలుపు గుర్రాలనే బరిలోకి దింపాలని భావిస్తున్నారట. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులపై గులాబీ పార్టీ ఓ అభిప్రాయానికి వచ్చిందని అంటున్నారు. అందులో పటాన్‌చెరు నుంచి ఆదర్శ్ రెడ్డి, శేరిలింగంపల్లి నుంచి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఖైరతాబాద్ నుంచి మన్నె గోవర్ధన్ రెడ్డి, రాజేంద్రనగర్ నుంచి సబిత ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, జగిత్యాల నుంచి ఎమ్మెల్సీ ఎల్.రమణ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ఇక భద్రాచలంలో రేగా కాంతారావుకు, స్టేషన్ ఘన్‌పూర్‌లో మాజీ

# ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడుతున్నారా ?



న్యూఢిల్లీ,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ షార్ట్ కట్ లో ఆర్ఎస్ఎస్ గా ఉన్న ఈ సంస్థ ఎపుడూ చర్చలో ఉంటూనే ఉంటుంది. ఆర్ఎస్ఎస్ మీద ఎక్కువగా విపఖాలు మాట్లాడుతూంటాయి. ఆర్ ఎస్ ఎస్ ని మత వాద సంస్థగా పేర్కొం టాయి. విపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో బీజేపీ ముందుకు వస్తూ ఉంటుంది బీజేపీ ఆర్ఎస్ఎస్ కి రాజకీయ అంగంగా పనిచేస్తుంది అన్నది తెలిసిందే. ఆర్ఎస్ఎస్ కి అనేక అనుబంధ విభాగాలు ఉన్నాయి. ఇక ఆర్ఎస్ఎస్ విషయం చూస్తే కనుక 1925లో ఈ సంస్థ బ్రిటిష్ ఇండియా హయాంలో ఏర్పాటు అయింది. ఆనాడు హిందువుల కోసం పనిచేసేందుకు ఏర్పాటు చేశారు అని చెబుతారు అయితే స్వాతంత్ర ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటి అన్నది విపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ కమ్యూనిస్టులు ఎపుడూ ప్రస్తావిస్తూంటాయి. అది వేరే విషయం కానీ ఇపుడు ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్యనే గ్యాప్ ఉందని వార్తలు రావడమే రాజకీయంగా ఆసక్తిని కలిగించే విషయంగా అంతా చూస్తున్నారు.

సంఘ్ వర్సెస్ బీజేపీనా :

ఇది ఎవరూ ఎపుడూ ఊహించనిదే. ఎందుకు అంటే ఆర్ఎస్ఎస్ కి బీజేపీ ఎపుడూ విధేయంగా ఉంటుంది అని చెబుతారు. అలాగే ఆర్ఎస్ఎస్ బీజేపీకి మార్గదర్శకత్వం వహిస్తూ ఉంటుంది. బీజేపీ గెలుపు కోసం ఆర్ఎస్ఎస్ పాటుపడుతూ ఉంటుంది. ఇలా సిద్ధాంతపరంగా ఒకే మార్గంలో పయనించే ఒక కొమ్మకు రెండు పూవులు లాంటి ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య గ్యాప్ వచ్చింది అంటేనే అది పెద్ద చర్చకు దారి తీస్తోంది అని అంటున్నారు. అయితే కాస్తా తరచి చూస్తే బీజేపీతో ఆర్ఎస్ఎస్ కి ఎలాంటి వివాదం లేదని బీజేపీకి నాయకత్వం వహిస్తూ దేశాన్ని నడుపుతున్న వారి విషయంలోనే విభేదాలు అని అంటున్నారు.

మోడీ ప్రభుత్వ విధానాల మీదనా :

కేంద్రంలో గత పదకొండేళ్ళుగా నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. అయితే బీజేపీ ఏలుబడిలో కార్పొరేట్ సంస్థలకే పెద్ద ఎత్తున లాభాలు జరిగాయని దేశంలో పేదలు మధ్యతరగతి వర్గాలకు అనుకున్న స్థాయిలో ప్రయోజనం సమకూరలేదని విమర్శలు ఉన్నాయి. కార్పొరేట్ శక్తులకు అండగా ఉండడమే కాకుండా భారీ ఆర్థిక ప్రయోజనాలు లభించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నది సంఘ్ కి నచ్చని విధానంగా ఉంది అని అంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వంలో కానీ పార్టీలో కానీ సమిష్టి నిర్ణయాలకు పెద్ద పీట వేయాలని ఆర్ఎస్ఎస్ బలంగా కోరుకుంటోంది అని చెబుతున్నారు. వ్యక్తి పూజకు బీజేపీని దూరంగా పెట్టాలని భావిస్తోంది. బీజేపీ గత పదకొండేళ్లుగా చూస్తే వివిధ రాష్ట్రాలలో సంస్థాగతంగా బలహీనం అయినట్లుగా ఆర్ఎస్ఎస్ భావిస్తోంది అని చెబుతున్నారు.

కొత్త నాయకత్వం కోసం :

సంస్థ శాశ్వతం వ్యక్తులు కాదు అన్నది ఆర్ఎస్ఎస్ ప్రాథమిక సూత్రం అని అంటున్నారు. అయితే దానికి విరుద్ధంగా బీజేపీలో జరుగుతున్న తీరు పట్ల సంఘ్ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారని అంటున్నారు. అందుకే 75 ఏళ్ళకే రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆర్ఎస్ఎస్ పరోక్షంగా సూచనలు ఇస్తోంది అని అంటున్నారు ఆ మధ్యన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇదే విషయం మీద గట్టిగానే మాట్లాడారు. మోడీ ఈ సెప్టెంబర్ 17తో 75 ఏళ్ళకు చేరువ అవుతున్న వేళ ఆర్ఎస్ఎస్ చేసిన సూచన ఆయన గురించే అని అంతా అంటున్న నేపథ్యం ఉంది.

సంఘ్ పట్టు అలాంటిది :

ఇదిలా ఉంటే ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య కొన్ని విషయాల్లో విభేదాలు ఉన్నాయని అంతా అనుకుంటూ వస్తున్నారు. వాటి విషయంలో బీజేపీ పెద్దలు కూడా పట్టించుకోలేదు. కానీ ఎపుడైతే 75 ఏళ్ళకే రాజకీయాలకు దూరం పాటించాలి అన్న రూల్ ని ఆర్ ఎస్ ఎస్ వల్లించడం మొదలెట్టిందో బీజేపీ పెద్దలకు కొంత కంగారు మొదలైంది అని అంటున్నారుఇ. నరేంద్ర మోడీ అయితే గత పదకొండేళ్ళుగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఎపుడూ వెళ్ళలేదు అని గుర్తు చేస్తున్నారు. అయితే ఇటీవలే ఆయన వెళ్ళి అక్కడ ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. దాని మీద శివసేన ఠాక్రే వర్గం నాయకుడు సంజయ్ రౌత్ అయితే కీలక వ్యాఖ్యలు చేశారు తన పదవిని నిలబెట్టుకోవడం కోసమే మోడీ ఆ విధంగా వెళ్లారు అని కూడా సంజయ్ రౌత్ చెప్పుకొచ్చారు. సెప్టెంబర్ 17లో మోడీ పదవి పూర్తి అవుతుందని కూడా ఆయన సంచలన వ్యాఖ్యలు కూడా చేశారు. అలా తొలిసారిగా మోడీ 75వ పుట్టిన రోజుని ముడిపెట్టి ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడడం జరిగింది.

ఆర్ఎస్ఎస్ కి ప్రశంసలు :

ఇక ఈ మధ్య జరిగిన ఎర్ర కోట మీద స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మోడీ చేసిన వంద నిముషాలకు పైగా ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ గురించి ఎక్కువగా మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ దేశానికి గత వందేళ్ళలో చేసిన సేవలను ఆయన ఎంతగానో కొనియాడారు. నిజానికి స్వాతంత్ర వేడుకలలో ఆర్ఎస్ఎస్ ప్రస్తావన ఎందుకు అన్నది విపక్షాలు సంధించిన ప్రశ్న ఆర్ఎస్ఎస్ కి స్వాతంత్రాని కి సంబంధం ఏమిటి అని కూడా వారు విమర్శించారు. అయితే ఆర్ఎస్ఎస్ ని ప్రసన్నం చేసుకోవడం కోసమే మోడీ ఈ విధంగా వ్యవహరినారు అని కూడా వారే చెప్పుకొచ్చారు. ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడుతున్నారని కూడా విమర్శించారు.

భయం నిజమేనా :

ఆర్ఎస్ఎస్ కి మోడీ భయపడడం నిజమేనా అంటే జరుగుతున్న ప్రచారం చూస్తే అలాగే ఉంది అని అంటున్నారు నిజానికి మోడీ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే. ఆయనకు ఆర్ఎస్ఎస్ ఎలా పనిచేస్తుంది అన్నది బాగా తెలుసు అని అంటారు. ఆర్ఎస్ఎస్ ఒక నిర్ణయం తీసుకుంటే అది అమలు చేసేందుకు ఏ విధంగా వ్యవహరిస్తుందో కూడా మోడీ కంటే ఎవరికీ బాగా తెలియదు అంటారు ఈ రోజున బీజేపీలో అత్యధికులు ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చి రాజకీయంగా కీలకమైన పదవులు చేపట్టిన వారే అని అంటారు ఆర్ఎస్ఎస్ అంటే బీజేపీకి విధేయత ఈనాటికీ ఉంది. ఆర్ఎస్ఎస్ ఒక్క మాట చెబితే శిరోధార్యంగా పాటిస్తారు. ఎందరో నేతలు ఆర్ఎస్ఎస్ నిర్ణయాలకు తలొగ్గి తమ పదవులు వదులుకున్నారు. అందులో 2009 తరువాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న ఎల్కే అద్వానీ కూడా పదవీ త్యాగం చేశారు అని గుర్తు చేస్తారు.

ఆర్ఎస్ఎస్ తలచుకుంటే :

ఇక ఆర్ఎస్ఎస్ మొత్తం బీజేపీని సంస్థాగతంగా పటిష్టం చేయాలని నిర్ణయించుకుంది అని అంటున్నారు. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఆర్ఎస్ఎస్ నుంచి నియమించాలని చూస్తోంది అంటున్నారు.

# హైకోర్టు తీర్పుతో సాదాబైనామాలకు శాశ్వత హక్కులు..

హైదరాబాద్, తెలంగాణలో ఎట్టకేలకు సాదాబైనామా రైతులకు విముక్తి లభించింది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న 9 లక్షల 894 సాదాబైనామా దరఖాస్తులను రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) భూ భారతి- 2025 చట్టం ప్రకారం క్లియర్ చేయాలని ప్రభుత్వాన్ని మంగళవారం తెలంగాణ హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఈ తీర్పుతో 2020లో ధరణి చట్టం వచ్చినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ క్లియర్ కానున్నాయి. సాదాబైనామా దరఖాస్తులను క్లియర్ చేయాలన్న కృతనిశ్చయంతో ఉన్న రేవంత్ రెడ్డి సర్కారు ఈ మేరకు హై కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో అఫిడవిట్ సమర్పించి క్రమబద్ధీకరణకు ఉన్న అడ్డంకులను తొలగించింది. 10 లక్షల ఎకరాల భూమి ఉన్న 9 లక్షల 894 మంది రైతులకు భూ యజమాన్య పట్టాలు వచ్చే విధంగా హై కోర్టు ఇచ్చిన ఆదేశాలపై డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులంతా పార్ట్ (బీ)లో ఉన్న 10 లక్షల ఎకరాల భూమి క్లియర్ అవుతుందని ఊపిరి పీల్చుకున్నారు. దరఖాస్తుదారులు ఇప్పటికైనా తమ సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో సగం భూమి సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా వెనుకబడిన అనేక గ్రామీణ ప్రాంతాలలో చిన్న, పేద, నిరుపేద రైతులు కూలినాలి చేసి సంపాదించుకున్న కొద్దిపాటి సొమ్ముతో టకరా, అరక ఎకరా, ఎకరంన్నర, రెండు ఎకరాలు ఇలా తమకు చేతనైనంత భూమిని కొనుగోలు చేశాశారు. రిజిస్ట్రేషన్‌పై అవగాహన లేక కొంత మంది, భూ యజమానికి డబ్బులు చెల్లించిన తరువాత రిజిస్ట్రేషన్ చార్జీలు కట్టలేక కొంత మంది నోటి మాట, తెల్లకాగితాలు, బాండ్ పేపర్లపై ఒప్పందాలతో డబ్బులు చెల్లించి భూములను కొనుగోలు చేసుకున్నారు. భూ యజమానులకు, కొనుగోలు దారులకు మధ్య తెల్ల కాగితమే కానీ మరే ఆధారం లేదు. అయితే తెలంగాణ సమాజంలో మాట మీద ఉన్న నమ్మకమే అనేక లావాదేవీలకు కారణం అవుతున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నది ఏమి లేకుండా మాటమీదనే నడిచింది. అయితే అమ్మకాలు కొనుగోళ్లు జరిగినా రికార్డులలో అమ్మిన భూమి యజమాని పేర్లే వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం రైతులకు కల్పించే ప్రయోజనాలు ఈ నిరుపేద రైతులకు దక్కడం లేదు.గతంలో ప్రతి ఏటా జమాబందీ జరిగేది. ఆ సందర్భంగా రెవెన్యూ అధికారులు గ్రామంలోనే ఉండి విచారణ జరిపి, ఎవరైనా రైతులు భూమి క్రయవిక్రయాలు చేస్తే వాటి యజమాన్య హక్కులను కొనుగోలు దారులకు కల్పిస్తూ రికార్డులు సరి చేసేవారు. అయితే క్రమేణా జమాబందీకి వరుస ప్రభుత్వాలు ఎగనామం పెట్టాయి. దీంతో ఇలాంటి క్రయవిక్రయాల విషయంలో యజమాన్య హక్కుల మార్పు జరగకుండా పెండింగ్‌లో పడిపోయింది.సాదాబైనామా పత్రాలున్న రైతులందరికీ 13-బీ ప్రొసీడింగ్‌లను జారీ చేసి పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తామని గత ప్రభుత్వం ప్రభుత్వం ప్రకటించింది. 2014 జూన్ 2 కంటే ముందు తెల్లకాగితం ద్వారా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు అర్హులైన రైతుల నుంచి (పట్టణాల్లో అవకాశం లేదు) దరఖాస్తులను స్వీకరించింది. మొదటి విడతలో సుమారు 12,64,000 మంది రైతులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పానుపుస్తకం చట్టం-1971 ప్రకారం అర్హులైన రైతులకు 13-బీ ప్రొసీడింగ్స్ జారీ చేసి, సుమారు 6లక్షల మందికి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు



అందించింది.ఆతరువాత కూడా రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సాదాబైనామాలకు మరోసారి అవకాశం ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 18, అక్టోబర్ 2021న సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అనుమతినిస్తూ 112 జీవో విడుదల చేసింది. అక్టోబర్ 30వ తేదీ వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఈ జీవోలో స్పష్టం చేసింది. సుమారు 2,26,693 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం మళ్లీ 10 నవంబర్ 2020 తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచగా, అదే నెల అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు 11 రోజుల వ్యవధిలో సుమారు 6,74,201 దరఖాస్తులు వచ్చాయి. దీంతో సాదాబైనామాల రెండవ విడత క్రమబద్ధీకరణకు మొత్తం 9,00,894 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు గత ప్రభుత్వం వెల్లడించింది. ఇదే సమయంలో 30, అక్టోబర్ 2020న ధరణి చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం సాదాబైనామాలకు అవకాశం లేదనందున రద్దు అయిన ఆర్వోఆర్ చట్టం ప్రకారం సాదాబైనామా దరఖాస్తులు ఎలా స్వీకరిస్తారు? ఎలా క్రమబద్ధీకరిస్తారు? అని ఒకరు పిల్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు 2020 అక్టోబర్ 29వ తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాగే అక్టోబర్ 29వ తేదీలోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 13%-%బీ పత్రాలను జారీ చేయవచ్చని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఆ ఆదేశాలు కూడా అమలుకు నోచుకోలేదు. తాజాగా 2020 అక్టోబర్ 30వ తేదీ లోపు స్వీకరించిన 2,26,693 దరఖాస్తులను, అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తులను తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్స్ ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించవచ్చని హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో మొత్తం 9లక్షల 894 దరఖాస్తులకు మోక్షం కలిగింది.

తీర్పును స్వాగతించిన డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్

సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల కేసులో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సాదాబైనామాలకు శాశ్వత హక్కులు లభిస్తాయని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీనిని చారిత్రాత్మక తీర్పుగా అభివర్ణించారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో సుమారు 9 లక్షల 894 మంది రైతులకు మేలు జరగడంతో పాటు సుమారు 10 లక్షల ఎకరాల భూములకు 13%-%బీ ప్రొసీడింగ్స్ జారీ అవుతాయని ఆకాంక్షించారు. ఈ ప్రక్రియ సంపూర్ణం అయితే తెలంగాణలో చాలా వరకు భూ వివాదాలు తగ్గుతాయని లచ్చిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో సాదాబైనామా రైతులకు ఊరట లభిస్తుందని తెలిపారు.

# ఆమె ఓ అవినీతి అనకొండ

తిరుపతి, వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అవినీతికి పాల్పడి అరెస్టు అయిన ఓ మహిళా అధికారిణపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యాలు చేశారు. ఆమె అవినీతిలో అనకొండ లాంటిదని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై మంత్రి నారాయణ చేసిన కామెంట్స్ నేపథ్యంలో భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశారు. సదరు అవినీతి అధికారి గతంలో మంత్రులను సైతం పూచికపుల్లలా చూసిందన్నారు. కనీసం తన శాఖకు సంబంధించిన మంత్రులను కూడా లెక్క చేయదంటూ ఆమె తీరును తప్పుపట్టారు. ఆమెకు డబ్బులు సంపాదించడమే తప్ప ఎలాంటి నైతిక విలువలు లేని అధికారని, తాటకి లాగా కింది స్థాయి అధికారుల పట్ల వ్యవహరించారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో తాము రోడ్లు వేస్తున్న సమయంలో అ అధికారి టీడీఆర్ బాండ్ల ద్వారా వందల కోట్లు కొట్టేయాలనే ప్లాన్ వేస్తే దానిని తాము అడ్డుకున్నామని, ఇది తట్టుకోలేక ఆమె నెల్లూరు జిల్లా నేతలకు తాము రెండు వేల కోట్లు దోచుకున్నా మంటూ ప్రచారం చేయించిందన్నారు. ఆ అధికారి గత 35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు దోచుకుందని ఆరోపించారు. మీ అవినీతి గురించి మాకు బాగా తెలుసు అని అత్యున్నత న్యాయస్థానం సైతం ఆమె గురించి వెటకారంగా చెప్పిందన్నారు. రోజూ ఆమె ధరించే చీర లక్షన్నర రూపాయలు అని.. 50 లక్షల రూపాయలకంటే విలువైన విగ్గులు ఆవిడకు 11 ఉన్నాయి అని.. ఒక్కో రోజు ఒక్కో విగ్గుతో దర్శనమిస్తుంటారంటూ భూమన సంచలన వ్యాఖ్యలు చూశారు. వైకాపా హయాంలో ఆ అధికారిణి పురపాలక శాఖ బాధ్యతలను పర్యవేక్షించారు. తన శాఖ మంత్రులను సైతం లెక్కచేయలేదు. డబ్బు సంపాదించడమే తప్ప.. ఏ నైతిక విలువలూ లేని మనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ తాటకిలా కింది అధికారుల పట్ల ఆమె వ్యవహరించారని భూమన తీవ్ర విమర్శలు చేశారు.

# భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు

వాషింగ్టన్, భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు  బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ- విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటే.. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, -టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చున్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందు కెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్ధే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుం దన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.

# కొత్త తరానికి ప్రాధాన్యం..

న్యూఢిల్లీ,భారతీయ జనతాపార్టీ ఇప్పుడు కొత్త  రూపు సంతరించుకుంటోంది. నవతరం ముందుకు రావడంతో సిద్ధాంతపరమైన నిబద్ధతలకు అవకాశం లేని కొత్త తరం దూసుకు వస్తోంది. అధికారమే పరమావధిగా ఇందులోని నేతలు ఆరాటపడుతున్నారు. అధికారం చేపట్టిన గత పదకొండేళ్లుగా మోడీ ద్వయం ఇక పార్టీలో తమకు తిరుగులేని విధంగా చేసుకున్నారు. విధాన నిర్ణయాలన్నీ ఇప్పుడు కేవలం మోడీ ద్వయం కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి పదవికి అనూహ్యంగా రాధాకృష్ణన్ ఎంపిక చేశారు. ఇదో రకంగా ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో జరిగిన వ్యవహారంగా చూడాలి. అలాగే ఇప్పుడు బిజెపి అధ్యక్ష బాధ్యతలు ఎవరికి కట్టబెడతార్నది చూడాలి. మోడీ అనుయాయులకా లేక, పార్టీని నమ్ముకున్న వారికా అన్నది తెలియాలి. ఇప్టపికే అధ్యక్ష పదవిని పూర్తి చేసుకున్న నడ్డా స్థానంలో ఎవరన్నది తేలడం లేదు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల కారణంగా నడ్డాను కొనసాగించారు. రాధాకృష్ణన్ లాగా ఇప్పుడు కొత్త తరం ఎవరైనా వస్తారా అన్న చర్చ సాగుతోంది. తెరవెనక్కి పోయిన రాంమాధవ్ లాంటి వారిని మళ్లీ ముందుకు తీసుకుని వస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆయన సమకాలీన వ్యవస్తలపై బాగా పట్టు ఉండడంతో పాటు, ఆర్ఎస్ఎస్ మనిషి. అయితే ఏదైనా మోడీ ద్వయంను కాదని ఏ ఒక్క నిర్ణయం కూడా జరగడం లేదు. అంతేగాకుండా పాతతరం నేతలకు మెల్లగా ఉద్వాసన పలికారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్వానీ ఇంటికే పరిమితం అయ్యారు. ఆయనకు కనీసం రాష్ట్రపతి పదవి కూడా కట్టబెట్టకుండా కక్ష తీర్చుకున్నారు. అలాగే మురళీమనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ లాంటి వారు దూరంగా ఉన్నారు. సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ లాంటి వారు గతించారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయడంతో వెంకయ్య నాయుడు ఇక పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన లేకుండా అయ్యారు. ఇక మిగిలిందల్లా..రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే. ఇప్పటికే శతృఘ్న సిన్హా, యశ్వంత్ సిన్హాలు బయటకు పోయారు. అరుణ్ శౌరి లాంటి వారు అడ్రస్ లేదు. మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కూడా కేంద్ర పార్టీలో ప్రమేయం లేకుండా పోయింది. ఈ క్రమంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు ఈ దఫా వరకు మంత్రులుగా కొనసాగుతారు. తరవాత వీరు కూడా పార్టీకి దూరం కావడం ఖాయమని గుర్తించాలి. ఇప్పటికే పార్టీలో వీరికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఈ క్రమంలో పార్టీ పునర్వ్యవస్తీకరణ తీరు చూస్తే మనకు వారి వ్యూహం అర్థం కాగలదు. దేవేంద్ర ఫడ్నవీస్‌కు స్థానం కల్పించడం మహారాష్ట్ర ప్రాధాన్యత తెలియచెబుతోంది.

# బాబు ఇప్పట్లో రిటైర్ అయ్యే ప్రశ్నే లేదంతే !



అమరావతి,టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో మీడియాలో ఊహాగానాలు రావడం ఎపుడూ జరుగుతూ ఉంటుంది అయితే ఈసారి జాతీయ స్థాయిలో ఈ ప్రచారం ఎక్కువ అయింది. బాబు తాను మధ్యలోనే సీఎం పదవిని వదిలేసి తన కుమారుడు ప్రభుత్వంలో పార్టీలో అతి ముఖ్య భూమిక పోషిస్తున్న నారా లోకేష్ కి పగ్గాలు అప్పగిస్తారు అన్న చర్చకు తాజాగా తెర లేచింది. అయితే జాతీయ స్థాయిలో ఈ వార్తలు రావడం కొంత విశేషంగా చూడాలి. అయితే ఎవరు ఏమనుకున్నా బాబు వ్యూహాలను ఆయన ఆలోచనలను అంచనా కట్టడంలో విఫలం అవుతున్నారు అని అనుకోవాలి.

అవన్నీ ఆయన రికార్డులే :

తెలుగుదేశం పార్టీకి గడచిన ముప్పయి ఏళ్ళుగా బాబు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇది పెద్ద రికార్డు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పద్నాలుగేళ్ళ పాటు మాత్రమే అధ్యక్ష స్థానంలో ఉన్నారు ఆ మీదట అంతా బాబు జమానాయే సాగుతోంది. ఇక ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ మొత్తం మూడు టెర్ములు నాలుగు ప్రమాణ స్వీకారాలు కలుపుకుని ఏడున్నరేళ్ళు మాత్రమే కొనసాగారు. అదే చంద్రబాబు నాలుగు ప్రమాణ స్వీకారాలు నాలుగు సార్లు సీఎం గా ఉంటూ ఏనాడో ఎన్టీఆర్ రికార్డుని అధిగమించారు. ఇప్పటికి అయితే బాబు సీఎం గా దాదాపుగా 16 ఏళ్ళ పాటుగా కొనసాగుతున్నారు. అంటే అన్న గారి రికార్డుకు రెట్టింపు అన్న మాట. ఇక తెలుగు సీఎంలు ఎవరూ సమీపంలో బాబు రికార్డుని అందుకోలేనంతగా ఆయన 2029 దాకా కొనసాగి ఒక సరికొత్త రికార్డు సృష్టించే ప్రయత్నంలో ఉన్నారని చెబుతారు.

బాబుదే ఆ క్రెడిట్ :

ఇక బాబు మరో అద్భుతమైన రికార్డుకు అతి సమీపంలో ఉన్నారు. బాబు 1978లో తొలిసారి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అయ్యారు. ఆ అయిదేళ్ళ టెరంలోనే ఆయన మంత్రిగానూ పనిచేశారు ఇక 2028 నాటికి చంద్రబాబు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి యాభై ఏళ్ళు నిండుతాయి. పైగా సీఎం గా ఉంటూ అతి చురుకైన రాజకీయ నేతగా ఆయన ఉంటూండగా ఈ రికార్డు సొంతం అవుతుంది అని అంటున్నారు. బాబు తో పాటు 1978లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వారు అంతా దాదాపుగా కనుమరుగు అయ్యారు. బాబు మాత్రం ఈ రోజుకీ తెలుగు నాట రాజకీయాలతో పాటు దేశ రాజకీయాలను సైతం శాసించే విధంగా కొనసాగుతున్నారు. అందువల్ల బాబు అర్ధ శతాబ్దం రాజకీయ జీవితం అతి పెద్ద పండుగ తెలుగు నాట కానుంది. అంతే కాదు దేశ రాజకీయాల్లోనూ ఇంతటి సుదీర్ఘమైన పొలిటికల్ ఇన్నింగ్స్ ఎవరికీ బహుశా ఉండవేమో. అందువల్ల మరో మూడేళ్ళలో అంతటి అరుదైన రికార్డు సొంతం కాబోతుండగా బాబు సీఎం పదవికి రాజీనామా చేసి తప్పుకుంటారు అనుకుంటే పొరపాటే అని అంటున్నారు.

బాబు సారధ్యంలోనే :

ఇంకో వైపు చూస్తే ఏపీ సీఎం గా నాలుగవ సారి బాధ్యతలు వహిస్తున్న బాబు అమరావతి రాజధానిని పోలవరం ప్రాజెక్ట్ ని ఒక రూపు రేఖకలు తీసుకుని రావాలని గట్టిగానే నిర్ణయించుకున్నారు. అందువల్ల ఈ టెర్మ్ బాబుకు చాలా ముఖ్యమైనది. ఆయన మొత్తం రాజకీయ జీవితంలో ఇపుడు కీలక దశ కూడా ఇదే. ఈ రెండూ అనుకున్నట్లుగా సాధిస్తే బాబు చరిత్ర పుటలలో నిలిచిపోతారు. ఆ మీదట 2029 ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిగా ఉంటూ కూటమికి బాబు సారధ్యం వహిస్తారు అని అంటున్నారు. ఆ ఎన్నికల్లో కూటమిని తిరిగి గెలిపించుకున్న మీదటన బాబు అపుడు లోకేష్ కి పగ్గాలు అప్పగించే దిశగా ఆలోచించవచ్చు అని అంటున్నారు. ఇక రాజకీయంగా చూస్తే కనుక ఏపీలో 40 శాతం ఓటు షేర్ తో వైసీపీ బలంగానే ఉంది బాబు ఈ మధ్యలో తప్పుకుంటే అది వైసీపీకి చాన్స్ ఇచ్చినట్లే అవుతుంది. అందువల్ల ఫైనల్స్ లోనే వైసీపీని రాజకీయంగా ఓడించి టీడీపీకి తిరుగులేని పరిస్థితిని తీసుకుని రావాలన్నది కూడా బాబు మార్క్ ఆలోచనలుగా చెబుతారు. ఏతా వాతా తేలేది ఏమిటి అంటే బాబు ఇప్పట్లో రిటైర్ అయ్యేది ఉండదని. సో ఆయన మీద వచ్చే ఏ వార్తలు అయినా పుకార్లుగానూ ఊహాగానాలుగానూ చూడాల్సిందే అని అంటున్నారు.

# సుంకాల పెంపు వేళ.. అమెరికా గడ్డపై భారత్ జెండా..

న్యూఢిల్లీ, భారతదేశానికి చెందిన రెండు స్టార్టప్ కంపెనీలు అగ్రరాజ్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశాయి. ఓ వైపు అమెరికా భారత్‌పై సుంకాలతో దాడులు చేస్తున్న సమయంలో..భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం తన ప్రయాణంలో గొప్ప ముందడుగును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించింది. బెంగళూరుకు చెందిన పిక్సెల్, హైదరాబాద్‌కు చెందిన ధ్రువ్ స్పేస్ స్టార్టప్ కంపెనీలు అమెరికాలోని ఎలోన్ మస్క్ కంపెనీ స్పేస్ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా తమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి సక్సెస్ ఫుల్‌గా ప్రవేశపెట్టాయి. ఈ ప్రయోగం కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి విజయవంతంగా జరిగింది. ఇక్కడ విశేషం ఏమిటంటే అంతర్జాతీయ ప్రయోగాలపై సుంకాల పెంపునకు ముందు విండో క్లోజ్ అవుతున్న సమయంలో రెండు కంపెనీలు ఈ ఘనతను సాధించాయి.

ప్రైవేట్ అంతరిక్ష రంగంలో భారత్..

ఒకే రాకెట్‌లో అంతరిక్షంలోకి చేరుకున్న రెండు భారతీయ స్టార్టప్ కంపెనీల ఉపగ్రహాలు వారి సాంకేతిక సంసిద్ధతను మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా భారతదేశం విశ్వసనీయతను కూడా బలోపేతం చేశాయి. పిక్సెల్ ప్రపంచం కోసం మేడ్ ఇన్ ఇండియా కథను సృష్టిస్తుండగా, ధృవ్ స్పేస్ కస్టమర్ల కోసం నమ్మకమైన పేలోడ్ హోస్టింగ్ ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రయోగంతో భారత్ ఇకపై కేవలం రాకెట్ ప్రయోగ గమ్యస్థానం కాదని, అంతరిక్ష సమస్యల పరిష్కారాలను సృష్టించడంలో ప్రపంచవ్యాప్తంగా పాత్ర పోషించగలదని రుజువు చేస్తుంది. ఫైర్‌ఫ్లై, LEAP-1తో భారత్ ప్రైవేట్ అంతరిక్ష స్టార్టప్‌లు కొత్త శిఖరాలకు చేరుకున్నాయి.

భూమిని నిరంతర రికార్డు చేస్తాయి..

ఈ ప్రయోగంలో పిక్సెల్ కంపెనీ తన మూడు కొత్త ఫైర్‌ఫ్లై ఉపగ్రహాలను ప్రయోగించింది. దీనితో కంపెనీ ఇప్పుడు మొత్తం ఆరు ఫైర్‌ఫ్లైస్‌ను యాక్టివ్‌గా కలిగి ఉందని తెలిపింది. ప్రతి ఫైర్‌ఫ్లైకి 135 కంటే ఎక్కువ స్పెక్ట్రల్ బ్యాండ్‌లలో, ఐదు మీటర్ల రిజల్యూషన్ చిత్రాలను తీయగల హైపర్‌స్పెక్ట్రల్ సెన్సార్‌లతో



కూడి ఉంటుంది. వ్యవసాయంలో పంటల పరిస్థితి లేదా కాలుష్యం, గ్యాస్ లీకేజీలు సంభవించినప్పుడు.. వాటికి సంబంధించి ఇప్పటివరకు కనిపించని వివరాలను ఫైర్‌ఫ్లై అందజేయనుంది. ఈసందర్భంగా కంపెనీ %జజూ% అవాయిస్ అహ్మద్ మాట్లాడుతూ.. "ఇప్పుడు మా ఉపగ్రహ చిత్రాలు భూమిని నిరంతర రికార్డు చేస్తాయి. ఇది భూమిని సజీవ ప్రయోగశాలగా మారుస్తుంది. ఫైర్‌ఫ్లై భూమిలోని ప్రతి భాగం డేటాను ప్రతిరోజూ పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. హనీబీ అని పిలువబడే తదుపరి తరం ఉపగ్రహాలు ఈ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి' అని అన్నారు.

ధృవ్ స్పేస్..

ధృవ్ స్పేస్ LEAP-1 ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇది హోస్ట్ చేయబడిన పేలోడ్ మిషన్. దీంతో ఇప్పుడు కంపెనీ అంతర్జాతీయ కస్టమర్ల కోసం దాని ప్లాట్‌ఫామ్‌పై పరికరాలను తీసుకెళ్లడానికి సౌకర్యాలను అందించగలదు. ఈసందర్భంగా కంపెనీ CEO సంజయ్ నెక్కంటి మాట్లాడుతూ.. "ఈ మిషన్ భారతదేశం, ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కొత్త అవకాశాలను సృష్టిస్తుంది." అని అన్నారు.

# భూమన చెప్పిన...ఈ రజియా సుల్తానా ఎవరు శ్రీలక్ష్మి?



అమరావతి,భూమన ఐఏఎస్ శ్రీలక్ష్మి గురించి మాట్లాడుతూ.. ఆమె ఒక తాటకి, పూతన, లంకిణి.. ఆధునిక రజియా సుల్తానా అంటూ మండి పడ్డారు. మనకు తాటకి తెలుసు, రామాయణంలో కనిపిస్తుందీ పాత్ర. ఇక పూతన అంటే భాగవతంలో వస్తుంది. లంకిణి కూడా రామాయణ పాత్రే. రజియా సుల్తానా ఎవరనే దగ్గర అందరి ఆలోచనలు ఆగిపోతున్నాయ్.ఒక వేళ అదే నిజమైతే.. రజియా సుల్తానా ఢిల్లీ సుల్తానేట్- మొదటి మహిళా పాలకురాలిగా చెప్పాల్సి వస్తుందని అంటారు. ఆమె 1236 నుంచి 1240 వరకూ ఢిల్లీని పాలించారు. ఆమె మహిళ అయినా ఆనాటి స్థితిగతులను తనకు అనువుగా మార్చుకుని, పురుషాధిక్యతను అధిగమించి.. సింహాసనం అధిరోహించి.. సైన్యాన్ని నడిపించి, రాజ్య వ్యవహారాలు చూసుకున్న ఏకైక డేరింగ్ డ్యాషింగ్ డైనమిక్ లేడీ లీడర్ గా చెబుతుంది ఆమె బయోగ్రఫీ.ఆమె ఎలాంటి దుస్తులు లేకుండా.. బహిరంగ ప్రదేశాల్లో గుర్రాలపై, ఏనుగులపై సవారీ చేసేదని అంటారు. సైనికులతో కలసి యుద్ధరంగంలో పోరాడేదని చెబుతుంది చరిత్ర. అంతే కాదు.. ఆమె పేరిట పలు సైనిక విజయాలు కూడా లిఖించబడ్డాయి. ఆమె తన రాజ్యానికి చెందిన సొంత నాణేలపై సుల్తానాగా తన పేరు లిఖింప చేసుకున్నారు. మామూలుగా అయితే ఆమె పేరు కేవలం రజియా మాత్రమే. కానీ తనకు తాను ఒక సుల్తాన్ గా ప్రకటించుకున్న ధీరోదాత్తగా పేరు.ఇదంతా ఇలా ఉంటే.. ఒకప్పుడు కలెక్టర్ శ్రీలక్ష్మి అంటే అదో నేమ్ అండ్ ఫేమ్. అప్పట్లో ఆమె నెల్లూరు కలెక్టర్ గా పని చేస్తున్నపుడు ఎందరో ఆడపిల్లలకు ఐఏఎస్ అనే ఒకానొక పదం తమ పేరు తర్వాత తగిలించుకోవడం ఒక ప్యాషన్ గా మార్చుకున్నారంటే అతిశయోక్తి కాదు. అలాంటి శ్రీలక్ష్మి వైయస్ హయాంలో.. భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే చెడ్డ పేరు మూట కట్టుకున్నారు. ఒక సమయంలో ఆమె చేత చేయించుకోవాల్సిన సంతకాలు అన్నీ చేయించుకుని.. ఇప్పుడామెను తాటకి, పూతన, అభినవ రజియా అంటూ లేని పోని మారు పేర్లను తగిలించడం.. ఏమనుకోవాలన్నది చాలా మంది వేస్తున్న ప్రశ్న.ఒకప్పుడు సీపీఐ నారాయణ వంటి వారి చేత అందాల రాణిగా అభినందనలు అందుకున్న శ్రీలక్ష్మి- వైయస్ ఫ్యామిలీతో పెట్టుకున్నందుకు అనారోగ్యం పాలై.. జుట్టు మొత్తం పోగొట్టుకున్నారు. దీంతో ఆమె విగ్గులు వాడే వరకూ వచ్చేశారు. చివరికి ఆమె పరిస్థితి ఎలాంటిదంటే ఎవరి కోసమైతే తాను ఇంత కష్టపడ్డానో... ఆ వర్గం నుంచి కూడా ఇలాంటి చీత్కార సత్కారాలను ఎదుర్కోవడం. ఈ లెక్కన రాజకీయ నాయకుల కోసం వారి స్వలాభ.. స్వార్థం కోసం పాటుపడే ఉన్నతాధికారుల పరిస్థితి ఏమై పోతుందో చెప్పడానికి ఒక నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తున్నారు ఐఏఎస్ శ్రీలక్ష్మి.

## తిరుమల పవిత్రతలో రాజీలేదు

తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదన్నారు. ముంతాజ్ హోటల్ వ్యవహారంపై పద్మావతి అతిథిగృహంలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయల తితిదే నిధులు వైకాపా నేతలు మింగేశారని ధ్వజమెత్తారు.

# రేవంత్‌ను చూపించి బీహారీ సెంటిమెంట్ రెచ్చగొడుతున్న పీకే !



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీహార్‌లో 'వోటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనడాన్ని ప్రశాంత్ కిషోర్ రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నారు. రేవంత్ రెడ్డి బీహారీలను కించపరుస్తారని.. బీహార్ ప్రజల డీఎన్ఏలో కూలీ పని చేయడం ఉందని వ్యాఖ్యలు చేశారని గుర్తు చేసి.. ఇలాంటి లీడర్ ను బీహార్ కు తీసుకు వచ్చి ప్రచారం చేయించుకుంటారా అని మండిపడ్డారు. బీహార్ ప్రజలను కులీలుగా, కార్మికులుగా మాత్రమే చూడటంగా అర్థం చేసుకుని ఆప్రకారం మాట్లాడుతున్నారని ఇది బీహార్‌కు తీవ్ర అవమానమని ప్రశాంత్ కిషోర్ "బీహార్ ప్రజలు కేవలం కూలీ పని చేయడానికి జన్మించారా? అయితే ఇక్కడికి ఓట్లు అడగడానికి ఎందుకు వస్తున్నారు?" అని రేవంత్ ను ప్రశ్నించారు. "రేవంత్ రెడ్డి ఎవరు? బీహార్‌లో అతని స్థితి ఏమిటి? అతను బీహార్ ప్రజలను అవమానించాడు. బీహార్‌కు అతను ఏమీ చేయలేదు" అని ప్రశాంత్ కిషోర్ తప్పుబట్టాడు.రేవంత్ రెడ్డి బీహార్ గ్రామాలకు వస్తే, ప్రజలు అతన్ని తరిమికొడతారని హెచ్చరించారు. రేవంత్ ను తరిమికొట్టడం బీహార్ ప్రతి వ్యక్తి బాధ్యత అని కూడా పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డిని బీహార్‌కు తీసుకురావడం ద్వారా కాంగ్రెస్, రాహుల్ గాంధీ బీహార్ ప్రజల గురించి ఏమి ఆలోచిస్తున్నారో అర్థమవుతోందన్నారు. రాహుల్ గాంధీ అలాంటి వ్యక్తితో యా త్రలు చేయడం ద్వారా అతని మనస్తత్వం తెలుస్తుందని విమర్శించారు. బీహార్ ప్రజలపై కాంగ్రెస్ కు ఏ మాత్రం గౌరవం లేదన్నారు.దక్షిణాది రాజకీయాల్లో పలు సందర్భాల్లో బీహార్ ను ఉదాహరణగా చూపిస్తుంటారు. దీన్ని ప్రశాంత్ కిషోర్ తమ రాష్ట్రంలో సెంటిమెంట్ రెచ్చగొట్టడానికి వాడుకుంటున్నారు. రేవంత్ తిరిగి వచ్చేసినా పీకే మాత్రం ఈ విషయాన్ని కాంగ్రెస్ ను కార్నర్ చేయడానికి ఉపయోగించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# తెలంగాణ బీజేపీలో మరో రాజాసింగ్ పుడుతున్నాడా?



హైదరాబాద్,మొన్న మొన్నటివరకు తెలంగాణ బీజేపీలో రాజా సింగ్ ?ఎపిసోడ్? చాలా తీవ్రంగానే నడిచిన సంగతి తెలిసిందే కదా. తెలంగాణ బీజేపీ నాయకులపై రాజాసింగ్? తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. రామచంద్రరావు కంటే ముందు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్?రెడ్డిని టార్గెట్?గా పెట్టుకొని రాజాసింగ్? చాలా తీవ్రమైన విమర్శలు చేశాడు. ఈ నాయకుల తీరువల్ల రాష్ట్రంలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని చెప్పాడు.వివిధ సందర్భాల్లో చాలా గట్టి విమర్శలే చేశాడు. ఒకసారి పార్టీ నుంచి సస్పెండ్? చేసినా మళ్లీ పార్టీలోకి తీసుకొని టిక్కెట్? ఇచ్చారు. కాని తీరు మార్చుకోని రాజాసింగ్? చివరకు తనకు తానై పార్టీకి రాజీనామా చేశాడు. ఇక ఇప్పుడు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా పార్టీ మీద అసంతృప్తిగా ఉన్నాడు. దాన్ని బయటపెట్టాడు కూడా. ఈయన కూడా తెలంగాణ బీజేపీ నాయకుల మీద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. మంగళవారం బీజేపీ రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ గిఫ్ట్‌గా ఇచ్చారు.తన అసంతృప్తిని తెలియచేయడానికే ఫుట్‌బాల్? గిఫ్ట్?గా ఇచ్చాడు. పార్టీ నాయకులు కావాలనే తనను టార్గెట్ చేసి.. తనతో ఫుట్‌బాట్ ఆడుకుంటున్నారని ఆవేదన చెందాడు. అందుకు సంకేతంగా ఫుట్‌బాల్? ఇచ్చాడు. కొంతకాలం కిందట బీజేపీ కార్యకర్తలపై కూడా విశ్వేశ్వర్ రెడ్డి మండిపడ్డాడు. 'మీకు కార్యకర్తలు అవసరం లేదా?' అని ఓ నాయకుడు ప్రశ్నించగా, కార్యకర్తలతో పనిలేదని అన్నాడు. తాజాగా పార్టీ నేతలపై హాట్ కామెంట్స్ చేశాడు.ఆయన మాటల్లోనే చెప్పాలంటే.. "చంద్రశేఖర్ తివారీని కలిస్తే రామచందర్‌రావును కలవమని, రామచందర్‌రావును కలిస్తే అభయ్ పాటిల్ వద్దకు వెళ్ళమని చెబుతున్నారు." ఈ రకమైన సమన్వయ లోపం, నాయకుల్లో ఒక స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం పార్టీపై ఆయనకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. విశ్వేశ్వర్‌రెడ్డి ఫుట్‌బాల్‌ను బహుమతిగా ఇవ్వడం ద్వారా తన నిరాశను, పార్టీలో ఉన్న గందరగోళాన్ని వ్యంగ్యంగా, బలంగా తెలియజేశాడు. ఇది కేవలం ఆయన వ్యక్తిగత సమస్య కాదన్నాడు.పార్టీలో ఉన్న అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్య అని చెప్పాడు. కేవలం వ్యక్తిగత సమస్యల గురించే కాకుండా విశ్వేశ్వర్‌రెడ్డి తన నియోజకవర్గాలైన రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ పనితీరుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆయన దృష్టిలో ఆ జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుల పనితీరు సరిగా లేదు. ముఖ్యంగా, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయం పూర్తిగా లోపించింది. "ఇలాంటి గందరగోళం కారణంగా కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు" అని అన్నాడు.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తలను క్రియాశీలం చేయడానికి నాయకత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించాడు. పార్టీలో అంతర్గత విభేదాలు, సమన్వయ లోపాలు ఇలాగే కొనసాగితే, అది కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని, తద్వారా పార్టీ భవిష్యత్తుకు నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించాడు. విశ్వేశ్వరరెడ్డి పార్టీ మీద అసంతృప్తి వ్యక్తం చేయడం ఇది మొదటిసారి కాదు.రెండేళ్ల కిందటే ఒకసారి తెలంగాణలో భారతీయ జనతాపార్టీ ఎదుగకపోవడానికి బీఆర్ఎస్ పార్టీతో ఉన్న అంతర్గత దోస్తీనే కారణమని అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్ అవుతుందని అనుకున్నారని కానీ అరెస్ట్ చేయలేదన్నాడు. బీఆర్ఎస్, బీజేపీ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నాయన్నాడు. అందుకే బీజేపీ దూకుడుకు బ్రేక్ పడిందన్నాడు.జూపల్లి, పొంగులేటి కూడా అందుకే పార్టీలో చేరడం లేదని.. ఎవరూ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపించడం లేదన్నాడు. కవితను అరెస్ట్ చేయకపోవడం వల్లనే ప్రజలు రెండు పార్టీలు ఒకటేనని అనుకుంటున్నారన్నాడు. బీఆర్?ఎస్?తోనే రాజకీయాల్లో ప్రవేశించిన కొండా తరువాత కాంగ్రెసు పార్టీలో చేరాడు. ఆ తరువాత బీజేపీలోకి వచ్చాడు. 2014లో బీఆర్?ఎస్? (అప్పటి టిఆర్?ఎస్?) తరపున లోక్?సభకు గెలవగా, 2024లో బీజేపీ తరపున గెలిచాడు.

# కడప రెడ్డెమ్మ వద్దులే.. ఆయన దగ్గరికి పోదాం!

కడప: కడప టీడీపీలో విచిత్ర పరిస్థితి. సుదీర్ఘ కాలం తర్వాత కడపలో టీడీపీ గెలుపొందింది. మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ నాయకుడు అంజాద్ బాషా, ఆయన కుటుంబ సభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఎన్నికల్లో టీడీపీకి కలిసొచ్చింది. టీడీపీ నుంచి ఆర్.మాధవీరెడ్డి బరిలో నిలిచారు. ఎన్నికల సమయానికి వైసీపీపై తీవ్ర వ్యతిరేక వాతావరణంలో, టీడీపీ నాయకురాలు మాధవీరెడ్డి దూకుడు జనానికి బాగా నచ్చింది.ఇలాంటి నాయకురాలైతేనే కడపలో వైసీపీ అరాచకానికి బుద్ధి చెబుతుందని ఎన్నికల సమయంలో అంతా భావించారు. అందుకే కంచుకోట లాంటి కడపలో వైసీపీ ఓటమిని మూటకట్టుకుంది. కానీ కొంతకాలానికే కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అంటే జనానికి మొహమెత్తుతోంది. ఆమె వ్యవహార శైలి ప్రజలకు నచ్చడం లేదు. అలాగని ఆమేమి ప్రజలకు నష్టం చేస్తున్నారా? అంటే అదేమీ లేదనే మాట వినిపిస్తోంది.కడపలో కొద్దోగొప్పో అభివృద్ధి పనుల్ని మాధవీరెడ్డి నేతృత్వంలో చేస్తున్నారనే మాట వినిపిస్తోంది. ఇవన్నీ పక్కన పెడితే, ఏందబ్బా, మాధవీరెడ్డి కరిచినట్టు మాట్లాడ్తాండారే అనే నిట్టూర్పు సొంత పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది. మాధవీరెడ్డి దగ్గరికి వెళ్లడం ఎందుకులేబ్బా, వాసు సార్ దగ్గరికి పోదామని టీడీపీ కార్యకర్తలు కూడా అంటున్న మాట. వాసు సార్ అంటే, మాధవీరెడ్డి భర్త.రాజకీయాల్లో మరికొంత కాలం కొనసాగాలని భావిస్తే, మాధవీరెడ్డి అర్థం చేసుకోవాల్సిన ప్రధాన విషయం ఒకటి వుంది. మాట పలకరింపు బాగుండాలి. ఆ తర్వాతే పనులు చేస్తారా? లేదా? అనేది జనం చూస్తారు. మాధవీరెడ్డి తీరు %ౌ%కడప యాసలో చెప్పాలంటే గదురుకుంటున్నట్టుగా వుంటుంది. అదేదో నెమ్మదిగా



చెప్పొచ్చు కదా? అని జనం అభిప్రాయం. కడప రెడ్డెమ్మ మాత్రం తానింతే, రావడం, రాకపోవడం మీ ఇష్టం అనే రీతిలో వుంటోంది.ఈ నేపథ్యంలో కడప టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాధవీరెడ్డి భర్త శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారా? లేరా? అని తెసుకున్న తర్వాతే, అటు వైపు వెళ్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాటతీరు బాగుంటుంది. ఒకవేళ చేయలేని పని ఏదైనా ఉన్నా, ఆ విషయాన్ని హర్ట్ కాకుండా సున్నితంగా ఆయన చెబుతారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాత్రం%ౌ% కొట్టినట్టు మొహం మీదే చెప్పేస్తోందన్న అభిప్రాయం బలంగా వుంది. ఈ తేడాతోనే ఎమ్మెల్యే మేడమ్ వద్దు, ఆమె భర్త ముద్దు అని కడప టీడీపీ శ్రేణులు అనుకుంటున్న పరిస్థితి.

# స్టాలిన్ బీహార్ టూర్‌పై దుమారం.. సవాల్ విసిరిన బీజేపీ



చెన్నై:తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ బీహార్ పర్యటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. బీహార్‌లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో బుధవారం స్టాలిన్ పాల్గొన్నారు.స్టాలిన్‌తో పాటు కనిమొళి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్, డీఎంకే నేతలు గతంలో బీహారీయులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను బీజేపీ గుర్తు చేసింది. వీటికి సమాధానం ఏదంటూ నిలదీస్తోంది. 2017లో స్టాలిన్ మాట్లాడుతూ.. ఉత్తరాది రాష్ట్రాలు యువతకు తగిన అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యాయని.. దీంతో తమిళనాడు లాంటి రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో బీహారీయులు వలస వస్తున్నారని విమర్శించారు.ఇక బీహారీలపై దయానిధి మారన్, ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీహార్‌లో మళ్లీ గుర్తు చేసే ధైర్యం ఉందా? అంటూ బీజేపీ సవాల్ విసిరింది. స్టాలిన్ బీహార్ పర్యటనకు ముందు తమిళనాడు మాజీ బీజేపీ చీఫ్ అన్నామలై ఎక్స్‌లో పోస్టు చేశారు. ముఖ్యమంత్రి, డీఎంకే నేతలు బీహార్ రాష్ట్ర ప్రజలను ఎగతాళి చేసిన వీడియోలు, క్లిప్‌లు పోస్ట్ చేశారు."బీహార్‌కు వెళ్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు నేను సవాలు విసురుతున్నాను. మీకు ధైర్యం ఉంటే.. "సనాతన ధర్మాన్ని నాశనం చేయాలి." అని మీ కుమారుడు ఉదయనిధి చేసిన ప్రకటన గురించి అక్కడ మాట్లాడగలరా? మీ బంధువు, డీఎంకే ఎంపీ దయానిధి మారన్ తమిళనాడులో బీహారీలు టాయిలెట్లు శుభ్రం చేస్తారని చేసిన ప్రకటనను మీరు ధైర్యంగా పునరావృతం చేయగలరా?." అని తమిళనాడులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com